ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

శుక్రవారం 20 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 154 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

అజిత్ దోవల్‌కు

అమెరికా కోర్టు సమన్లు

దోవల్, గోయెల్‌కు సమన్ల పంపిణీకి ఆదేశం

పన్నూన్ కేసులో కీలక పరిణామం 2





వాహనదారులకు

కేంద్రం తీపికబురు

బీఎస్-6 వాహనాలకు
పీయూసీ గడువు భారీగా పెంపు
కొత్త నిబంధనలు జారీ 2

సిద్ధిపేటకు ఏం చేశారు?

సీఎం మాటల్లో వజన్.. చేతల్లో విజన్ లేదు

రేవంత్ ప్రసంగమంతా వ్యక్తిగత విమర్శలే.. కేసీఆర్ పథకాలన్నీ రద్దు చేశారు

రైతుల సమస్యలు పట్టవా? హరీశ్ విమర్శలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటనలో చేసిన ప్రసంగంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్ధిపేట ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం ప్రసంగంలో ప్రజా సమస్యల ప్రస్తావన లేదని, కేవలం వ్యక్తిగత విమర్శలు, ప్రగల్భాలకే పరిమితమయ్యారని అయన సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. గంటకు పైగా సాగిన ముఖ్యమంత్రి ప్రసంగంలో కరువుతో అల్లాడుతున్న రైతులకు ఊరట కలిగించే అంశాలు ఒక్కటీ లేవని హరీశ్ రావు విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధిపేట అభివృద్ధి కోసం మంజూరు చేసి, ప్రస్తుతం నిలిపివేసిన రూ.1,070 కోట్ల పెండింగ్ పనుల గురించి గానీ, ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం గురించి గానీ సీఎం ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మాటల్లో వజన్, చేతల్లో విజన్ లేదని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

-హైదరాబాద్, నవంబర్ 19 (సింగిడి) 2



రేషన్ కార్డు లేకపోయినా

రూ.5 లక్షల బీమా!

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

సిద్ధిపేట సభ వేదికగా పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రీమియం లేకుండానే ప్రతి కుటుంబానికి బీమా రక్షణ

నేటి నుంచి నెల రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అధికారికంగా ప్రారంభమైంది. సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. ఇందుకోసం లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తి ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందుతుంది. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నట్లయితే, ఎవరి పేరిట బీమా తీసుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చు.

సిద్దిపేట, నవంబర్ 19 (సింగిడి) 2

బీజేపీతో టచ్‌లో హరీశ్‌రావు

వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్‌లో ఉండరు

సిద్దిపేటలో రూ.550 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం..

కాంగ్రెస్‌ను గెలిపిస్తే నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తా: సీఎం రేవంత్‌రెడ్డి 2

పారిశ్రామిక క్లస్టర్లకు బలమైన రోడ్ నెట్‌వర్క్

రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

పారిశ్రామిక క్లస్టర్లకు బలమైన రోడ్ నెట్‌వర్క్

మంచి రోడ్లు లేకుండా ఏ దేశం కూడా అభివృద్ధి చెందదు : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు



తెలంగాణ రాష్ట్రంలో రహదారులతో పాటు ఇతర మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 వరకు రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకనామీ చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు.

హైదరాబాద్, నవంబర్ 19 (సింగిడి) 2



మూడేళ్లయినా నెరవేరని

ఆరు గ్యారంటీలు

రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం

ఢిల్లీకి గులాములుగా మారిన నేతలు

కాంగ్రెస్ అవినీతిపై కేటీఆర్ సమరశంఖం 2

కాంగ్రెస్ ప్రభుత్వంలో 20 శాతం కమీషన్ ఇవ్వనిదే పనులు జరగడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలే బహిరంగంగా చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పర్సంటేజీలు ఇవ్వనిదే పనులు కావడం లేదని చెబుతుండగా, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిపై రూ.5 లక్షల కోట్ల దోపిడీ, టెండర్లలో అవినీతి, కుంభకోణాల ఆరోపణలు చేస్తున్నారని గుర్తుచేశారు.

-హైదరాబాద్, నవంబర్ 19 (సింగిడి)

ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో

కలిసికట్టుగా కృషి

భూగోళంపై ప్రభావం చూపే అంశాలపై చర్చలు కొనసాగాలి

వాషింగ్టన్ బీజింగ్ మాస్కో దేశాధి నేతల త్రైపాక్షిక సమావేశం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం త్రైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ త్రైపాక్షిక భేటీని ఒక మైలురాయి ఘట్టంగా అభివర్ణించిన షీ జిన్‌పింగ్. మూడు దేశాల మధ్య సహకారం కోసం ఆయన రెండో ప్రపంచ యుద్ధం నాటి కూటమిని ప్రస్తావించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో చైనా, రష్యా, అమెరికాలు పరస్పరం సహకరించుకుంటూ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, స్థిరత్వాలను ఉమ్మడిగా కాపాడుతూ మానవ పురోగతికి మరింత కృషి చేయాలని కోరారు. ప్రపంచ శాంతి, భద్రత కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ప్రధాన శక్తులపై ఉందన్నారు.

న్యూఢిల్లీ, నవంబర్ 19 (సింగిడి) 2

'ఇండియా ఫస్ట్'

నినాదంతో ముందుకు 2

పరిశ్రమలకు ప్రధాని మోదీ పిలుపు

ప్రపంచానికి ఏమి అందించగలమో చూడాలి

అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న ఉత్పత్తులను రూపొందించాలి

గత లోపాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ నిరంతరం మెరుగుపడాలి

వికసిత భారత్ లక్ష్య సాధనకు పరిశ్రమల పాత్ర అత్యంత కీలకం

ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వార్షిక సర్వసభ్య సమావేశ ప్రారంభోత్సవంలో ప్రధాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "కేవలం దేశీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా.. ప్రపంచ అవసరాలను తీర్చడానికి పరిశ్రమలు సిద్ధం కావాలి. మనం ప్రపంచానికి ఏమి అందించగలమో చూడాలి. విదేశాల్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలి. అప్పుడే భారత ఉత్పత్తులు మన గుర్తింపులో ప్రధాన భాగమవుతాయి. ఈ విధంగా ముందుకు సాగే క్రమంలో 'ఇండియా ఫస్ట్' మీ సూత్రం కావాలి.

-న్యూఢిల్లీ, నవంబర్ 19 (సింగిడి)





తెలంగాణ ఇంటర్ పరీక్షల

షెడ్యూల్ విడుదల

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన కీలక ప్రక్రియ ప్రారంభమైంది. రాబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారికంగా ప్రకటించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన జనరల్, ఒకేషనల్ విభాగాల పరీక్షల తేదీలను బోర్డు కార్యదర్శి కె.ఆర్. అభిలాష్ అభినవ్ వెల్లడించారు. ఈ షెడ్యూల్ ప్రకారం థియరీ పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభమై మార్చి 20 వరకు కొనసాగనున్నాయి.

-హైదరాబాద్, నవంబర్ 19 (సింగిడి)

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ

గ్లోబల్ సెమీకండక్టర్ క్యాపిటల్‌గా తిరుపతి.. క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతి

సూర్యలంక, గండికోట ప్రాంతాలకు టూరిజం మాస్టర్ ప్లాన్

మూడు ప్రాంతాల అభివృద్ధిపై చంద్రబాబు సమీక్ష 2

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల (ఎకనామిక్ రీజియన్స్) ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి అసలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఈ మూడు ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి బ్లూప్రింట్లపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం పరిశ్రమల రాక, పెట్టుబడుల ఆకర్షణ మాత్రమే అభివృద్ధి కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

- అమరావతి నవంబర్ 19 (సింగిడి)



ఉత్తరాంధ్రపై 'అక్వాన్' తీవ్ర ప్రభావం!

శుక్రవారం మధ్యాహ్నం నరసాపురం-పూరీ మధ్య తీరం దాటనున్న తుపాను

తీరం దాటే సమయంలో గంటకు 110 కి.మీ వేగంతో పెనుగాలులు

తుపాను ప్రభావం ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాలపైనే కేంద్రీకృతం 2

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'అక్వాన్' తీరం దాటే సమయానికి తీవ్రత తగ్గి బలహీనపడనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుపాను గత ఆరు గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా కదిలింది.

అమరావతి, నవంబర్ 19 (సింగిడి)



రేషన్ కార్డు లేకపోయినా రూ.5 లక్షల బీమా!



అర్హతలు, నిబంధనలు ఇవే.. ఈ పథకానికి 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు. అంటే 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. పథకం ప్రారంభ సమయంలో 59 ఏళ్లలోపు ఉండి, ఆ తర్వాత గరిష్ఠ వయో పరిమితి దాటిన వారికి కూడా మరో ఏడాది పాటు బీమా రక్షణ కొనసాగుతుంది. ఈ పథకంలో మరో కీలక విషయం ఏమిటంటే.. తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి కాదు. రేషన్ కార్డు లేని వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దరఖాస్తు సమయంలో నామినీ వివరాలు తప్పనిసరిగా సమర్పించాలి. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొనే అవకాశం ఉంది. వారికి ఎంత శాతం వాటా ఇవ్వాలనేది కూడా స్పష్టంగా నమోదు చేయాలి.

నవంబర్ 19 నుంచి ప్రత్యేక దరఖాస్తు శిబిరాలు ఈ పథకం కోసం ప్రభుత్వం నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనుంది. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో ఈ క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డుతో పాటు అందుబాటులో ఉంటే రేషన్ కార్డును తీసుకెళ్లాలి. ప్రభుత్వ సిబ్బంది కూడా నేరుగా ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తారు. రేషన్ కార్డులు లేని వారి కోసం ప్రత్యేక దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచనున్నారు.

ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు మాత్రమే అనుమతిస్తారు. త్వరలోనే ప్రత్యేక వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కూడా ప్రభుత్వం కల్పించనుంది. చేనేత, మత్స్యకారులకు రూ.5 లక్షల బీమా ఇప్పటికే చేనేత కార్మికులు, మత్స్యకారులకు అమల్లో ఉన్న బీమా పథకాల పరిహారాన్ని కూడా ప్రభుత్వం పెంచింది. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న బీమా మొత్తాన్ని ఇకపై రూ.5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు మరింత ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు జరిగే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.



పారిశ్రామిక క్లస్టర్లకు బలమైన రోడ్ నెట్‌వర్క్

'కనెక్టింగ్ రోడ్స్ క్రియేటింగ్ టుమారో' ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో పెట్టుబడుల సాధనలో సమ్మిట్ కీలకమని తెలిపారు..

"మంచి రోడ్లు లేకుండా ఏ దేశం కూడా అభివృద్ధి చెందదు. ధనిక, అభివృద్ధి చెందిన దేశాలు గొప్ప రోడ్లను నిర్మించవు. గొప్ప రోడ్లే దేశాలను ధనిక, అభివృద్ధి చెందిన దేశాలుగా మారుస్తాయి. పారిశ్రామిక క్లస్టర్లను అనుసంధానించే బలమైన రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంపై మా దృష్టి ఉంది. గడ్కరీ జీ, జాతీయ ప్రయోజనాలు, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాలు, ప్రజల సంక్షేమం వంటి అంశాల్లో రాజకీయాలు ఉండవని నేను గట్టిగా నమ్ముతున్నా. సమయం వచ్చినప్పుడు మనం ఎన్నికల్లో పోరాడుదాం. కానీ మిగిలిన సమయంలో, దేశ అభివృద్ధిపై దృష్టి పెడదాం. జాతీయ అభివృద్ధిలో తెలంగాణ తన వంతు పాత్ర పోషించేలా నేను చూస్తాను. ఇప్పుడు, నా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కూడా మద్దతు ఇవ్వాలి" – రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

రహదారులు సరిగా ఉంటే పెట్టుబడులు

రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్‌గా ఉందని నితిన్ గడ్కరీ చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు. అయితే పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత విషయంలో మనం ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. రోడ్లపై ఎలాంటి బ్లాక్ స్పాట్లు ఏర్పడకుండా ఉండేందుకు ప్రతి ఇంజినీర్ పూర్తి బాధ్యత తీసుకుని పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

''"దేశంలో రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ మాటలు చెప్పడం కొంచెం ఇబ్బందిగా ఉన్నా.. చెప్పక తప్పని పరిస్థితి. ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షల మంది చనిపోతున్నారు. వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. ఈ రోడ్లపై ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి?. డీపీఆర్‌లు ఎలా తయారవుతున్నాయి? ఒక్క డీపీఆర్ కూడా సరిగ్గా తయారు కావడం లేదు. ఈ పదం వాడుతున్నందుకు క్షమించండి. ఇకపై రోడ్లపై బ్లాక్ స్పాట్స్ కనిపించకూడదు. బ్లాక్‌స్పాట్ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఇంజినీర్లదే" – నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి

ఎన్‌హెచ్-65ను ఆరు లైన్లుగా విస్తరించాలి

ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులతు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్–విజయవాడ ఎన్‌హెచ్–65ను ఆరు లైన్లుగా విస్తరించాలని కోరారు. హెచ్ఐసీసీలో జరుగుతున్న ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్' సదస్సు ఈనెల 22 వరకు కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా రోడ్లు, జాతీయ రహదారుల రంగానికి చెందిన నిపుణులు సహా సుమారు 3,500 మంది పాల్గొన్నారు.

సిద్దిపేటకు ఏం చేశారు?

తాడి చెట్టు, గడ్డం అంటూ ముఖ్యమంత్రి బాడీ షేమింగ్‌కు పాల్పడ్డారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిలో బలంగా వేర్లు ఉండటం వల్లనే తాడి చెట్టు ఎన్ని తుఫాన్లు వచ్చినా ఉక్కులా నిలబడుతుందని పేర్కొన్నారు. గౌడన్నలకు కల్పతరువైన తాడి చెట్టును పదే పదే తూలనాడినందుకు సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ మారడంపై తనను ఒట్టేయమని సీఎం అడగటాన్ని తప్పుబట్టిన హరీశ్ రావు.. తెలంగాణ దేవుళ్లం దరిపై ఒట్టు వేసి రైతన్నలను మోసం చేశారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి నిలబెడితే, ఆమెను ఓడించింది ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి కాదా హరీశ్ రావు ప్రశ్నించారు.

పథకాల రద్దుపై పచ్చి అబద్ధాలు..

గత ప్రభుత్వం నిర్మించిన వాటికి రిబ్బన్లు కట్ చేయడం, మెడికల్ కాలేజీలకు పేర్లు మార్చడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ పథకాలను రద్దు చేయలేదని సీఎం అబద్ధాలు చెబుతున్నారని మండిపడుతూ.. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య లక్ష్మి , ఫీజు రీయింబర్స్‌మెంట్, దళిత బంధు, రైతు బీమా, గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్, మన ఊరు-మన బడి, కంటి వెలుగు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ముత్యంరెడ్డి క్యాన్సర్ బారిన పడినప్పుడు కేసీఆర్ రూ.కోట్లు ఖర్చు చేసి అమెరికాలో వైద్యం చేయించిన మానవతావాది అని గుర్తు చేశారు. సిద్దిపేటకు ఒక్క రూపాయి మేలు చేయకుండా, కేవలం కేసీఆర్‌పై నోరు పారేసుకోవడం అంటే సూర్యుడిపై ఉమ్మేయడమేనని హరీశ్ రావు తన ట్వీట్‌లో ఘాటుగా స్పందించారు.

ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో కలిసికట్టుగా కృషి

ఎనిమిది దశాబ్దాల క్రితం మూడు దేశాల మధ్య ఉన్న ఉమ్మడి చరిత్రను ప్రస్తావించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్. 80 సంవత్సరాల క్రితం ఫాసిస్టు వ్యతిరేక కూటమికి మద్దతుగా మన మూడు దేశాలు కలిసి పోరాడి గొప్ప విజయాన్ని సాధించాయని గుర్తు చేశారు. ఈ క్రమంలో శాంతిని కాపాడాయని వివరించారు. ఈ చారిత్రక జ్ఞాపకాలను మూడు దేశాలు కాపాడుకోవాలని, గతం నుంచి పాఠాలు నేర్చుకుంటూ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లపై చర్చల మార్గాలను తెరిచి ఉంచాల్సిన ప్రత్యేక బాధ్యత ప్రపంచంలోని ప్రధాన శక్తులపై ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా, చైనా, రష్యా నాయకుల మధ్య జరిగిన ఈ మొట్టమొదటి త్రైపాక్షిక సమావేశాన్ని దౌత్యపరమైన ఏకాకితనం నుంచి వైదొలగడానికి అవసరమైన మార్పుగా అభివర్ణించారు. ప్రపంచంలోని మూడు అతిపెద్ద దేశాల అధ్యక్షులుగా కేవలం మన ప్రజలపైనే కాకుండా, యావత్ భూగోళంపై ప్రభావం చూపే అంశాలపై గౌరవప్రదమైన చర్చలను కొనసాగించాల్సిన ప్రత్యేక బాధ్యత మనపై ఉందన్నారు. గత దౌత్య విధానాలకు భిన్నంగా ఈ త్రైపాక్షిక సమావేశం జరుగుతోందని ట్రంప్ పేర్కొన్నారు. జిన్‌పింగ్, పుతిన్‌లతో కలిసి మరింత సురక్షితమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు ఒక కొత్త మార్గాన్ని అన్వేషించడమే తన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని ఇతర దేశాల్లో అణు వ్యాప్తి ముప్పును ఎదుర్కోవడానికి మూడు దేశాలు కలిసికట్టుగా పనిచేయడం చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండనివ్వబోమని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి పుతిన్‌తో ఇప్పటికే సుదీర్ఘ ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు స్పష్టం చేశారు. జాతీయ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి ఉమ్మడి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) నియంత్రణ లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును ఎదుర్కోవడానికి ఈ మూడు అగ్రరాజ్యాలు కలిసి పనిచేయాలని కోరారు. పుతిన్ మాట్లాడుతూ ఆర్థిక సంబంధాలు, ఆహార, ఇంధన భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో మూడు దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని రష్యా అధ్యక్షుడు పుతిన్ అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం సహా ఇతర ప్రాంతీయ వివాదాలను పరిష్కరించడంలో ఈ మూడు దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. మాస్కో, బీజింగ్, వాషింగ్టన్ మధ్య పరస్పర గౌరవం, సమతుల్య ప్రయోజనాలతో కూడిన నిర్మాణాత్మక సహకారం ప్రపంచ స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదం, సరిహద్దులు దాటిన వ్యవస్థీకృత నేరాలు వంటి నేటి సవాళ్లను ఎదుర్కోవడంలో ఉమ్మడి ఆసక్తి ఉందన్నారు.

బీజేపీతో టచ్‌లో హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 19 (సింగిడి)

2029లో మరోసారి తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణతో పాటు సిద్దిపేట గడ్డపైనా కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఘంటాపథంగా ప్రకటించారు. సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఈ నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు కోరుకున్న నాయకుడికే టికెట్ ఇస్తామని, గెలిపించుకునే బాధ్యత ప్రజలదేనని స్పష్టం చేశారు. సిద్దిపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

హరీశ్‌రావు బీజేపీతో టచ్‌లో ఉన్నారు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి హరీశ్‌రావు బీఆర్ఎస్‌లో ఉండరని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ చేసిన పనులే తిరిగి హరీశ్‌రావు రూపంలో రాబోతున్నాయని అన్నారు. హరీశ్‌రావు బీజేపీతో టచ్‌లో ఉన్నారని ఆరోపించారు. ఈ విషయంలో నిజాయతీ ఉంటే సిద్దిపేట ఎల్లమ్మపై ఒట్టు వేసి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి?

కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ కుటుంబాల ఆస్తులపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. రంగనాయక్‌సాగర్ సమీపంలో హరీశ్‌రావుకు, కొండపోచమ్మ దగ్గర కేసీఆర్‌కు వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. హైటెక్ సిటీకి సమీపంలోని జన్వాడలో కేటీఆర్‌కు ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందని నిలదీశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన ఎంతోమంది కుటుంబాలు అప్పుల్లో ఉంటే, కేసీఆర్, హరీశ్‌రావు కుటుంబాలు, వారి బంధువులు వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. అసెంబ్లీకి వస్తే నీళ్ల దోపిడీ, భూముల దోపిడీ, లిక్కర్ దోపిడీని బయటపెడతానని హెచ్చరించారు. సిరిసిల్ల, నేరెళ్లలో ఇసుక దోపిడీకి కేటీఆర్, సంతోష్‌రావు కుటుంబాలు పాల్పడ్డాయని ఆరోపించారు.

తెలంగాణకు అన్యాయం చేసే ప్రసక్తే లేదు

తెలంగాణ ప్రయోజనాలకు తాను ఎప్పుడూ విరుద్ధంగా వ్యవహరించబోనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి పేరుతో తాను ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వదులుతున్నానంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. తాను తెలంగాణలోనే పుట్టానని, ఈ మట్టిలోనే పెరిగానని, చివరకు ఈ మట్టిలోనే కలుస్తానని వ్యాఖ్యానించారు. తనపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని, అసెంబ్లీకి వస్తే అన్ని అంశాలపై చర్చిద్దామని కేసీఆర్‌కు సవాల్ విసిరారు.

బతుకమ్మ చీరల్లోనూ దోపిడీ

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు అందించే బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడిందని సీఎం ఆరోపించారు. గుజరాత్, సూరత్ నుంచి నాసిరకం చీరలు తెచ్చి మహిళలకు పంపిణీ చేశారని విమర్శించారు. నవంబర్ 26న కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు అందించనున్నట్లు ప్రకటించారు. సొంత చెల్లి కవితకు ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో కేటీఆర్ ఆమెను కుటుంబం నుంచి దూరం చేశారని ఆరోపించారు. సొంత చెల్లినే ఆదరించని వ్యక్తి కోటి మంది మహిళలకు ఎలా అండగా ఉంటారని ప్రశ్నించారు.

శ్రీకాంతాచారి తల్లికి పదవి ఇవ్వని కేసీఆర్

తెలంగాణ కోసం ఎల్బీనగర్ చౌరస్తాలో శ్రీకాంతాచారి ప్రాణత్యాగం చేస్తే, కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెట్టుకున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కుమారుడు, కుమార్తె, అల్లుడు, మేనల్లుడి కుమారుడికి పదవులు ఇచ్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి తల్లికి మాత్రం పదేళ్లపాటు ఎలాంటి పదవి ఇవ్వలేదని మండిపడ్డారు. మళ్లీ దొరల పాలన రావాలని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని విమర్శించారు.

సిద్దిపేట అభివృద్ధికి రూ.550 కోట్లు

సిద్దిపేట అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.550 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ కార్యకర్తలు తమ నినాదాలతో తాటిచెట్టు గుండెలు అదిరేలా చేయాలని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సిద్దిపేటలో కాంగ్రెస్‌కు ఉన్న పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మదన్‌మోహన్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

సిద్దిపేట ఎవరి కోట కాదు: మహేశ్‌కుమార్‌గౌడ్

సిద్దిపేట ఎవరి సొంత కోట కాదని, ఆ కోటలు బీటలు వారే సమయం వచ్చిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సిరిసిల్లలో ప్రారంభమైన కాంగ్రెస్ జైత్రయాత్ర సిద్దిపేటకు చేరుకుందని పేర్కొన్నారు. ఇకపై సిద్దిపేటలో ఒక్క కుటుంబ ఆధిపత్యం కొనసాగదని స్పష్టం చేశారు.

మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: సీతక్క

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం కొత్తగా 4.75 లక్షల పింఛన్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

అజిత్ దోవల్‌కు అమెరికా కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, నవంబర్ 19 (సింగిడి)

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కు సంబంధించిన కేసులో అమెరికా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దోవల్‌తోపాటూ రా మాజీ చీఫ్ సామంత్ గోయెల్ లకు ఢిల్లీ కోర్టుల ద్వారా సమన్లు అందజేయాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. న్యూయార్క్‌లోని సదరన్ డిస్ట్రిక్ట్ ఫెడరల్ కోర్టు జడ్జి క్యాథరిన్ పోల్క్ ఫైలా ఈ ఉత్తర్వులు జారీ చేశారు. కొరియర్ ద్వారా ఈ సమన్ల పత్రాలను ఢిల్లీలోని మూడు జిల్లా కోర్టులకు పంపాలని కోర్టు క్లర్క్‌ను ఆదేశించారు.

'ఇండియా ఫస్ట్' నినాదంతో ముందుకు

రాబోయే 20 ఏళ్ల దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయాల్లో 'ఇండియా ఫస్ట్' విధానాన్ని పునాదిగా చేసుకోవాలి. అలా చేసినప్పుడే భారత్ 'ఆత్మనిర్భర్' గా మారుతుంది" అని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా గత శతాబ్ద కాలంలో భారత ఆర్థిక ప్రయాణాన్ని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాల పాటు అమలైన లైసెన్స్–కోటా రాజ్, బ్యాంకులు, ఇతర రంగాల జాతీయీకరణ విఫల ప్రయోగాల వల్ల దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడిందని ప్రధాని పేర్కొన్నారు. "గత 100 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను చూసింది. మనం లైసెన్స్ కోటా రాజ్‌ను చూశాం. ఒక దశలో ప్రపంచ 'ఫ్రాజైల్ ఫైవ్'లో చేరే స్థాయికి పడిపోయాం. కానీ, ఆ పరిస్థితులను దాటుకుని భారత్ ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. సుమారు 7% వృద్ధి రేటును కొనసాగించే దిశగా పయనిస్తోంది. అదే సమయంలో పేదరికం నుంచి బయటపడే వేగం కూడా అద్భుతంగా ఉంది" అని ప్రధాని వివరించారు.

మూడేళ్లయినా నెరవేరని ఆరు గ్యారంటీలు

సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తుండటం కాంగ్రెస్ పాలనలో పరిస్థితికి నిదర్శనమన్నారు. ఇది ప్రజా పాలన కాదని, అవినీతి పాలన అని కాంగ్రెస్ నేతలే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రపంచ బ్యాంకుకు కూడా అర్జీలు పెట్టుకునే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. తమ నియోజకవర్గాలకు నిధులు రావడం లేదని, ఉన్న నిధులన్నీ కొడంగల్‌కు తరలిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తాము కేవలం పెళ్లిళ్లు, చావులకు మాత్రమే పరిమితమయ్యామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

వాహనదారులకు కేంద్రం తీపికబురు

బీఎస్-6 వాహనాలకు పీయూసీ గడువు భారీగా పెంపు, కొత్త నిబంధనలు జారీ

న్యూఢిల్లీ, నవంబర్ 19 (సింగిడి)

దేశవ్యాప్తంగా ఉన్న వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. వాహనాల పొల్యూషన్ అండర్ కంట్రోల్ అంటే పీయూసీ సర్టిఫికేట్ చెల్లుబాటు కాలాన్ని సవరిస్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 1989 నాటి కేంద్ర మోటారు వాహనాల నిబంధనలను సవరిస్తూ, నవంబర్ 13న కేంద్ర మోటారు వాహనాల పదహారవ సవరణ నిబంధనలు 2026ను నోటిఫై చేసింది. ముఖ్యంగా భారత్ స్టేజ్–6 అంటే బీఎస్–6 వాహనాల పునరుద్ధరణ వ్యవధిని వాటి వయస్సు, అవి రవాణా వాహనాలా లేక వ్యక్తిగత రవాణేతర వాహనాలా అనే అంశంతో అనుసంధానించింది. ఈ కొత్త నిబంధనలు అధికారిక గెజెట్‌లో ప్రచురించిన తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి.

వ్యక్తిగత బీఎస్–6 వాహనాలకు 3 ఏళ్ల గడువురవాణేతర అంటే వ్యక్తిగత అవసరాలకు వాడే బీఎస్–6 వాహనాలకు కేంద్రం భారీ వెసులుబాటు కల్పించింది. వాహనం మొదటి రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 6 ఏళ్లలోపు వయస్సు ఉన్న వాహనాలకు పీయూసీ సర్టిఫికేట్ ఒకేసారి 3 సంవత్సరాల పాటు చెల్లుబాటులో ఉంటుంది. అలాగే 6 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉండి, 10 సంవత్సరాలకు మించని బీఎస్–6 వాహనాలకు ప్రతి సంవత్సరం ఒకసారి సర్టిఫికేట్‌ను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక 10 సంవత్సరాల కంటే పాతవైన వాహనాలకు ప్రతి 6 నెలలకు ఒకసారి పీయూసీ తీసుకోవడం తప్పనిసరి.

పాత మోడళ్ల నిబంధనలు

బీఎస్–6 రవాణా వాహనాలకు వేర్వేరు చెల్లుబాటు కాలాలను నిర్దేశించారు. మొదటి రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 6 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న రవాణా వాహనాలకు పీయూసీ సర్టిఫికేట్ 2 సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుంది. 6 నుంచి 10 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వాహనాలకు ఏడాదికి ఒకసారి, 10 సంవత్సరాల కంటే పాతవైన వాహనాలకు ప్రతి 6 నెలలకు ఒకసారి కొత్త సర్టిఫికేట్ తీసుకోవాలి. మరోవైపు పాత ఉద్గార నిబంధనల వాహనాల విషయానికొస్తే, బీఎస్–1, బీఎస్–2, బీఎస్–3 వాహనాలకు పీయూసీ సర్టిఫికేట్ కేవలం

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి 'విశాఖ బే–టెక్ సిటీ'గా నామకరణం చేశారు. గతంలో హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను నిర్మించిన విధంగానే, విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బే–టెక్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగర మేయర్‌కు వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఈ రీజియన్‌లో 167 ప్రాజెక్టులకు గానూ ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. విజయనగరం, అనకాపల్లి వైపు వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని చెప్పారు. భూ లభ్యత తక్కువగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక ల్యాండ్ పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు.

సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎల క్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల రంగాలకు అవసరమైన ఆర్ అండ్ డి సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి క్లస్టర్లను బలోపేతం చేయడంతో పాటు ఈ రీజియన్‌లోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయాల



అర్హులకు పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

కామారెడ్డిప్రతినిధి నవంబర్ 19 (సింగిడి)

గాంధారి: కామారెడ్డి జిల్లా గాంధారి మండలం రామలక్ష్మణపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ పథకంలో భాగంగా గురువారం అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ అనిల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులకు అధికారిక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. పెన్షన్ ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఉపసర్పంచ్ కృష్ణమూర్తి, అధ్యక్షుడు సంజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ అస్లం, బాయ్, లాండే బాబురావు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అంద జేశారు.

రంతిబాయి మృతిపై హరాలే తానాజీరావు పరామర్శ

కామారెడ్డి ప్రతినిధి
నవంబర్ 19(సింగిడి)



గాంధారి: కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నేరల్ తండాకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ బస్సీ చందా నాయక్ తల్లి రంతి బాయి (19-11-2026) గురువారం పరమ పదించారు. ఈ విషయం తెలుసుకున్న గాంధారి మండల మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరాలే తానాజీ రావు వెంటనే నేరల్ తండాలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా రంతి బాయి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, ఈ విషాద సమయంలో అండగా ఉంటామని తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమంలో గాంధారి మండల మాజీ సర్పంచ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యం, మాజీ వైస్ ఎంపీపీ భజన్ లాల్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముస్తఫా, స్థానిక సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్ రాథోడ్ నెహ్రూ తదితరులు పాల్గొని రంతి బాయి మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోనరావుపేట బస్టాండ్ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 19 (సింగిడి)



జిల్లాలో కోనరావుపేట మండల బస్టాండ్‌లో మంచినీటి వసతి లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజూ పలు గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తాగునీటి కోసం చుట్టుపక్కల దుకాణాలపై ఆధారపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బస్టాండ్ అభివృద్ధి కోరకు ప్రస్తుత బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు తగిన సౌకర్యాలు లేవని, వేసవి ఎండలో, వర్షానికి తప్పించుకునేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందువల్ల మంచినీటి కుళాయిలు, సీసాలు, నీటి వెండింగ్ యంత్రాలు, పరిశుభ్రమైన టాయిలెట్లు, షెడ్లు, కూర్చోవడానికి బెంచీలు, వెలుతురు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి బస్టాండ్‌ను ఆధునీకరించాలని కోరుతున్నారు.కోనరావుపేటలో తాగునీరు కుళాయిల ద్వారా అందుతున్నప్పటికీ, బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులకు తగిన తాగునీటి సౌకర్యం అందుబాటులో లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో రోజువారీ ప్రయాణాలు చేసేవారి సంఖ్యను దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కరీంనగర్, నవంబర్19(సింగిడి)



రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం బొమ్మకల్‌లో మరో కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం తూకం వేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, పట్టాలు అందుబాటులో ఉంచామని, తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. దళారులను నమ్మకుండా ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కార్పొరేటర్లు మేకల వెంకటేష్, గాదె రూప శ్రీనివాస్, నాయకులు, మార్కెట్ కమిటీ

- విద్యార్థినులకు ఇదేనా నాణ్యమైన భోజనం?
- దోమకొండ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో తల్లిదండ్రుల ఆందోళన
- దసరా సెలవుల సందర్భంగా ఒక్కో విద్యార్థిని నుంచి రూ.200 వసూలు చేశారంటూ ఆరోపణలు
- భోజనంలో కప్ప అవశేషాలు కనిపించాయంటూ తల్లిదండ్రుల ఆవేదన
- సమగ్ర విచారణకు డిమాండ్

గురుకులంలో వసూళ్ల ఆరోపణలు

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 19 (సింగిడి)



దోమకొండ: విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, సురక్షిత వాతావరణం కల్పించాల్సిన గురుకుల పాఠశాలలో వివాదాలు తెరపైకి వస్తున్నాయి. కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ మీనాక్షి వ్యవహారశైలిపై విద్యార్థినుల తల్లిదండ్రులు పలు ఆరోపణలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు భోజన నాణ్యత విషయంలోనూ నిర్లక్ష్యం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు.సెలవుల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.200?దసరా సెలవుల సందర్భంగా ఇళ్లకు వెళ్లే విద్యార్థినుల నుంచి 550 మంది వద్ద రూ.200 చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విద్యార్థినులు సెలవుల అనంతరం పాఠశాలకు ఆలస్యంగా వస్తారనే కారణంతో డబ్బులు తీసుకున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ విషయంపై పేరెంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా సరైన సమాధానం లభించలేదని పేర్కొంటున్నారు.ఈ వసూళ్లకు సంబంధించి ఎలాంటి ప్రభుత్వ జీవో లేదా సర్క్యులర్ జారీ కాలేదని జిల్లా డీసీవో కార్యాలయం నుంచి పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులకు సమాచారం అందినట్లు తల్లిదండ్రులు వెల్లడిస్తున్నారు. అంతేకాకుండా నగదు రూపంలోనే డబ్బులు తీసుకోవాలని, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు వద్దని చెప్పడంపై కూడా వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై పాఠశాల యాజమాన్యం వివరణ ఇవ్వాల్సి ఉంది.భోజనంలో కప్ప అవశేషాలు కనిపించాయా?మరోవైపు నవంబర్ 9వ తేదీన విద్యార్థినులకు వడ్డించిన కూరలో కప్ప అవశేషాలు కనిపించాయని కొందరు విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు తెలిపినట్లు సమాచారం. ఒక విద్యార్థిని భోజనం చేస్తున్న సమయంలో గిన్నెలో అవశేషాలు కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అప్పటికే సుమారు 60 శాతం మంది విద్యార్థినులు భోజనం చేసినట్లు వారు చెబుతున్నారు.ఈ ఘటనపై పాఠశాల సిబ్బంది స్పందించిన తీరు కూడా ప్రశ్నార్థకంగా ఉందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విషయం బయటకు చెప్పవద్దంటూ విద్యార్థినులను భయపెట్టినట్లు వారు పేర్కొంటున్నారు. కొందరు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు వచ్చినప్పటికీ సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై వైద్యపరమైన వివరాలతో పాటు ఆహార నమూనాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.విద్యార్థినుల ఆరోగ్య భద్రతకు బాధ్యత ఎవరిది?గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినుల భోజనం, వసతి, ఆరోగ్యం, విద్యా ప్రమాణాల పర్యవేక్షణ అత్యంత కీలకం. తల్లిదండ్రులు తమ పిల్లలను నమ్మకంతో పాఠశాలలకు పంపిస్తుంటే, అక్కడ వారికి అందించే ఆహార నాణ్యతపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థినుల నుంచి డబ్బుల వసూళ్ల ఆరోపణలు, ఆహారంలో అవశేషాలు కనిపించాయనే ఫిర్యాదులు ఒకేసారి తెరపైకి రావడంతో పాఠశాల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారులు స్పందించాలి..
సమగ్ర విచారణ జరపాలి

జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి (డీసీవో), ఆర్సీవో అధికారులు వెంటనే స్పందించి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థినుల నుంచి డబ్బులు వసూలు చేశారా? వసూలు చేసి ఉంటే ఎవరి ఆదేశాలతో తీసుకున్నారు? భోజనంలో కప్ప అవశేషాలు కనిపించాయన్న ఆరోపణల్లో వాస్తవమెంత? విద్యార్థినులకు వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్యం జరిగిందా? అనే అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ సమస్యను ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థినుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశంపై ఉన్న తాధికారులు ఎప్పుడు స్పందిస్తారో వేచి చూడాల్సిందే!

ఖేలో ఇండియా క్రీడలకు హనుమకొండ ముస్తాబు

హనుమకొండ ప్రతినిధి
నవంబర్ 19 (సింగిడి):



-జాతీయస్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 అథ్లెటిక్స్ పోటీలకు ఆతిథ్యమివ్వనున్న హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియాన్ని సరికొత్త హంగులతో తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. స్టేడియం గ్యాలరీలకు ఆకర్షణీయమైన రంగులు వేయడంతో పాటు ఖేలో ఇండియా లోగోను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి స్టేడియానికి క్రీడా శోభ తీసుకురావాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు.ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్యాలరీలకు రంగులు వేయడం, స్టేడియం సుందరీకరణ, ఖేలో ఇండియా లోగో ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేడియం రూపురేఖలు జాతీయస్థాయి క్రీడా పోటీలకు తగిన విధంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ వెంకన్నను పారిశుద్ధ్యం, పరిసరాల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డిసెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జేఎన్ఎస్ స్టేడియంలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, సాంకేతిక బృందాలు ఈ పోటీలకు హాజరుకానున్నారు.క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత, వసతి, భోజనం, రవాణా వంటి అన్ని సదుపాయాలను పకడ్బందీగా కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య బృందాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచడంతో పాటు పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. జీడ బ్ల్యూఎ ంసీ, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, క్రీడా శాఖల సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జాతీయ స్థాయి క్రీడాకారులకు ఆకట్టుకునేలా జేఎన్ఎస్ స్టేడియాన్ని తీర్చిదిద్ది, ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది.ఈ కార్యక్రమం లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

కవితక్కను ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయం

మానకొండూర్, నవంబర్19(సింగిడి)



తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బెజ్జంకి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు ఎర్రవెల్లి మహేందర్ పటేల్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రక్షణ సేన పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ ఫౌండర్ చైర్మన్ చెన్నమల్ల చైతన్య హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెజ్జంకి మండల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, పరిశ్రమల కారణంగా కలుషితమవుతున్న పర్యావరణం, గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరత, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితక్క ప్రవేశపెట్టిన పాంచజన్య సూత్రాల ఆశయాలు, సిద్ధాంతాలను గ్రామగ్రామాన, గడపగడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం సాధించడం పార్టీ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు.కవితక్కను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చూడటమే తమ రాజకీయ ధ్యేయమని, ఆ లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, ఐకమత్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా ప్రస్తుత ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇద్దరూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ, వాటి పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అట్టిపెల్లి మధుసూదన్, తొందుర్తి అక్షయ్ కుమార్, రాజేష్, కిషోర్, రమేష్ , అంజనేయులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి.. మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
సిరిసిల్ల అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
రాజన్న సిరిసిల్ల,
నవంబర్ 19 (సింగిడి):



వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజు ఓపీకి ఎంత మంది వస్తారని ఆరా తీశారు.ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, వ్యాక్సిన్లు, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఇతర గదులు, ఫార్మసీ, ఆసుపత్రి ఆవరణలో పరిశీలించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఏ.ఎన్.ఎం. లతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఏ.ఎన్.సీ రిజిస్ట్రేషన్లు, గర్భిణీల ఆరోగ్య విషయాలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని సూచించారు.ఎన్.సీ.డి స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీని ద్వారా ముందు గానే వ్యాధి లక్షణాలను గుర్తించి, అవసరమైన చికిత్స అందించడానికి అస్కారం ఉంటుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణం, పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 19 (సింగిడి)



జిల్లా సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని గాంధీ చౌక్ పద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడుతూ.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేశారని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆమె చేసిన సేవలు మరువలేనివని, పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని పేర్కొన్నారు.ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కరపత్రాన్ని ఆవిష్కరించారు.సిద్దిపేటలో నిర్వహిస్తున్న సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు శ్రీనివాసరెడ్డి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి గడ్డం నరసయ్య బాలరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చఆడెపు చంద్రకళ కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం బొద్దుల శ్రీనివాస్ లింగంపల్లి గంగరాజు వెంగళ లక్ష్మీ నరసయ్య పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొప్ప దేవయ్య ప్రధాన కార్యదర్శి నీలి రవీందర్ మాజీ పట్టణ అధ్యక్షులు పత్తిపాక లక్ష్మీరాజు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె రియాజు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు అధ్యక్షులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









ఇది ప్రజాపాలనా... పోలీసుల నిర్బంధ పాలనా?

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 19, (సింగిడి):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటనలో భాగంగా భారస పార్టీ నాయకులను పోలీసులు అర్ధరాత్రి నుంచే జిల్లాలో ముందస్తు అరెస్టుల పరంపర కొనసాగింది.సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్, డివిజన్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఉన్న భారస నాయకులను పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం అప్రసమాజికమని భారస నాయకులు తీవ్రంగా ఖండించారు. సిద్దిపేట కు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భయంతో ఎందుకని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సిద్దిపేట లో ఎక్కడ చూసినా అడుగడుగునా పోలీసు బలగాలను మోహరించి, వేలాది మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రజలు నిలదీస్తారనే భయమా అని ప్రశ్నించారు.సిద్దిపేటకు ఏం చేశారో సీఎం సమాధానం చెప్పండి!సిద్దిపేటలో మధ్యంతరంగా ఆగిపోయిన అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ పక్కనే ఉన్న వెటర్నరీ కళాశాల పరిస్థితి ఏమిటి, కోమటి చెరువు పక్కన ఉన్న శిల్పారామం పనులు ఎందుకు నిలిచిపోయాయి. టూ టౌన్ పోలీస్ స్టేషన్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. నర్సింగ్ కళాశాల పనులు ఎప్పుడు పూర్తవుతాయని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్లపై కనీసం గుంతలు కూడా పూడ్చలేని అసమర్థ పాలన కాదా అని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేట అభివృద్ధికి ఇప్పటివరకు ఎన్ని నిధులు కేటాయించిందో, ఎన్ని నిధులు ఖర్చు చేసిందో ప్రజలకు లెక్క చెప్పాలని భారస నాయకులు డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అర్ధరాత్రి నుంచే ముందస్తు అరెస్టులు చేయించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరని, అరెస్టులతో ప్రజల గొంతును నొక్కలేరని వారు హెచ్చరించారు. ముఖ్యమంత్రి పర్యటనల పేరుతో ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం మానుకొని, సిద్దిపేట ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని భారస నాయకులు డిమాండ్ చేశారు.







Editorial

ఎడిటోరియల్

బాలల హక్కుల పరిరక్షణతోనే

ఉజ్వల భవిష్యత్తు

"ప్రపంచ బాలల దినోత్సవం" సందర్భంగా...



నేటి బాలలే రేపటి భావి ప్రపంచ పౌరులు. బాల్యం ఆనందాలకు చిరునామా. బాల్యం సున్నితం, బహు సుందరం. బాల్యం అద్వితీయ అనుభవాల నెలవు. అందరం బాల్యదశ నుండి ఎదిగిన వారమే. కుటుంబ సంతోషాలకు ప్రేరణ చిరునవ్వుల చిన్నారులు. పిల్లలకు ప్రశ్నించడం, తెలుసు కోవాలనే తపన ఉండడం గమనిస్తుంటాం.
సమాజంలో ఒక ప్రధాన భాగమైన బాలల భవితను సన్మార్గంలో నిర్మించాల్సిన కనీస బాధ్యత నేటి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజంపై ఉన్నది. నేటి చిన్నారులకు కూడా మనతో సమానంగా మానవ హక్కులు ఉంటాయని గమనించాలి. నేడు బాల్యం ఛిద్రం అయితే రేపటి తరం నిర్వీర్యం అవుతుంది. నేటి బాలల అభ్యున్నతికి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగితేనే బంగారు భవిష్యత్తు ఆవిష్కృతం అవుతుంది.

నేటి బాలలపై పెట్టుబడి రేపటి ఉజ్వల భవిష్యత్తుకు పునాది:
2వ ప్రపంచ యుద్ధం తర్వాత విశ్వ బాలల దీన పరిస్థితులను, ముఖ్యంగా యూరోప్ ప్రాంత చిన్నారుల మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడానికి ఐరాస అంగమైన యూనిసెఫ్ దిద్దుబాటు చర్యలకు పూనుకోవడం జరిగింది. నాడు బాలల హక్కుల పరిరక్షణ సదస్సులో తీసుకున్న తీర్మానం మేరకు పిల్లలకు మానవ హక్కులు ఉంటాయని, వాటిని అమలు చేయాలని, అవగాహన కల్పించాలని, చర్చించి తగు సమాధానాలు వెతకాలని, బంగారు బాటలు వేయాలనే పలు సదుద్దేశాలతో ప్రతి ఏట యూనిసెఫ్ నాయకత్వంలో 20 నవంబర్ రోజున ఐరాస సభ్య దేశాలు "ప్రపంచ బాలల దినోత్సం(వరల్డ్ చిల్డ్రన్స్ డే)" ఘనంగా నిర్వహించడం 1990 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ బాలల దినోత్సవం -2026 ఇతివృత్తంగా "నా రోజు, నా హక్కులు, నా భవిష్యత్తు(మై డే, మై రైట్స్, మై ఫ్యూచర్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. భారత్‌లో ప్రతి నవంబర్ 14న "జాతీయ బాలల దినాన్ని", 01 జూన్‌న "అంతర్జాతీయ బాలల దినం" కూడా పాటిస్తున్నామని మనందరికీ తెలుసు. పిల్లలకు చదువులతో పాటు ఆటపాటలు, లలిత కళల పట్ల ఆసక్తిని గమనించి శిక్షణను ఇవ్వడానికి పెద్దలు చొరవ చూపాలి.

ప్రపంచ బాలల ప్రధాన సమస్యలు:
ప్రపంచ బాలల హక్కులను నిర్లక్ష్యం చేయడం, అపార్థం చేసుకోవడం, కాలరాయడం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. నేటి బాలల సంక్షేమ చర్యలే రేపటి ప్రపంచ ఉజ్వల భవితకు రాచబాటలు మరిచిపోతున్నాం. ఆధునిక ప్రపంచ బాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పేదరికం, ఆకలి కేకలు, పోషకాహారలోపాలు, అవిద్య, సామాజిక మాద్యమాల దురలవాటు, సహచరుల ఒత్తిడి, స్క్రీన్ టైమ్ అవలక్షణాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, చదువుల ఒత్తిడి, స్థూలకాయం, శారీరక ఎదుగుదల లోపించడం, అనవసర ఆందోళనలు, భావోద్వేగ సవాళ్లు, లైంగిక వేధింపులు, సురక్షిత నీటి కొరత, బాల కార్మిక అవస్థలు, లింగ-ఆధార హింస, యుద్ధ దేశాల్లో దుష్ప్రభావాలు, వలసల దుఃఖాలు, గృహ వసతులు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వాతావరణ మార్పులతో అనారోగ్యాలు, కాలుష్య ప్రతికూలతలు, కుటుంబ సమస్యలు, అక్రమ రవాణాలు, జాతి వివక్షలు, మానసిక సమస్యలు లాంటివి గుర్తించబడినవి.

బాలల హక్కులకు పట్టం కడదాం:
విశ్వ బాలల హక్కులు ఎలాంటి చర్చలను తావులేనివి. బాలల హక్కులను కావరాయడం అంటే రేపటి వారి ఉజ్వల భవిష్యత్తును పాతరేయడమే. నేడు, రేపు, భవిష్యత్తులో సదా ప్రపంచ మానవాళి సంతోషంగా ఉండాలంటే బాలల పెంపకంలో అతి శ్రద్ధ అనివార్యం. పిల్లల ఆలోచనలు విందాం. వారిలో దాగిన సృజనను ప్రోత్సహిద్దాం. వారి అనుమానాలను ఓపికగా నివృత్తి చేద్దాం. వారి సున్నిత మనసులను ఆప్యాయంగా ఆదరిద్దాం. తల్లితండ్రుల జీవన సాఫల్యత వారి పిల్లల ఎదుగుదల ప్రమాణాలపై మాత్రమే ఆధారపడి ఉంటుందని తెలుసుకుందాం. నేటి ప్రపంచ బాలల దినోత్సవ వేదిక ఆధారంగా సకల సౌకర్యాలను కల్పిస్తూ చిరు మొక్కవలె పంచుదాం, మహా వృక్షంగా ఎదిగి మరి కొందరికి నీడనిచ్చే స్థాయికి చేర్చుదాం. చిచ్చర పిడుగుల్లో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాలను పెంచుదాం. సృజనకు పట్టం కడదాం. కలలను సాకారం చేసుకునే విధంగా సౌకర్యాలను కల్పించాలి.

పసి పిల్లలు తోటలో మొగ్గల్లాంటి వారని, వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తే పరిమళ సుగంధ పుష్పాలుగా వికసిస్తారని గుర్తుంచుకుందాం. బాల్యాన్ని చిదిమేయడం అంటే రేపటి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే. కుటుంబం విచ్ఛిన్నమైతే విశ్వం వల్లకాడు అవుతుంది. మన బాలల్ని మనసారా ప్రేమించడం అంటే వారి పెంపకంలో అత్యంత శ్రద్ధ వహించడమే. నేటి ప్రపంచ బాలల్ని రేపటి విశ్వ నాయకుల స్థాయికి చేర్చడానికి మనందరం నిచ్చెనగా నిలబడదాం, తడబడినపుడు ఊతకర్రగా నిలుద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మహిమాన్వితాలు... పంచపర్వాలు



కార్తీకమాసం అన్ని మాసములలో, అత్యంత పవిత్రమైనదిగా భావించ బడుతున్నది. 'న కార్తీక సమో మాసః' అని అత్రి మహాముని వచనము. కార్తీక మాసంతో సమానమైన మాసం లేదని అర్థం. కార్తీక మాసంలో చేయదగిన పుణ్య కార్యక్రమాలలో నదీ స్నానం, ఉపవాసం, పురాణ పఠనం, ఆధ్యాత్మిక అంశాల శ్రవణం, దీపారాధనం, దీప దానం, తులసిమాల ధారణం, సాలగ్రామ పూజ, దైవ పూజ, వనభోజనం మున్నగునవి. కాగా వీటిలో విశేష పుణ్య ఫలాలను ఇచ్చేది కార్తీక స్నానం.

జ్యోతిష శాస్త్ర ప్రకారం ప్రతి మాస నిర్ణయము ఆ మాసంలో పౌర్ణిమ రోజున వచ్చే నక్షత్రం ఆధారంగా చేయబడుతుంది.. "చంద్రుడు పౌర్ణిమ రోజున కృత్తికా నక్షత్రములో సంచరించే మాసం కార్తీక మాసం".

అంబా దులా నితంతీ చ, అభ్రయంతి తథైవ చ, వర్షయంతి చపుణికా, షడ్ ఏతే కృత్తికా స్మృతా...అంబా, దులా, నితంతీ, అభ్రయంతీ, వర్షయంతీ, చపూణికా అనే పేర్లతో పిలవబడే షట్మాతృకలు కార్తీక మాస మునకు అధిపతులు.
కృత్తికా నక్షత్రము కృత్తికలకు అధిష్టానము, అగ్ని స్వరూపము. అశ్వినాది 27 నక్షత్రములు దేవతలకు ఇంద్రియ ములుగా చెప్పబడ్డాయి. 'నక్షత్రం దేవమింద్రియం అని శ్రుతి వచనం. వాటిలో అతి ముఖ్యమైన తేజస్సును దేవతలకు అందించే నక్షత్రం కృత్తికా. అట్టి కృత్తికా నక్ష త్రముతో కూడిన పౌర్ణిమాస్య కలిగిన ఈ మాసము కార్తీక మాసముగా, విశేష పుణ్య ఫలదముగా చెప్ప బడింది. చాంద్రమాన రీత్యా ఎనిమిదవ మాసమైన కార్తీకమునకు ఒక విశేష స్థానము కలదు. శరదృతువు ఉత్తర భాగములో వచ్చే కార్తీక మాసము నెల రోజులు పర్వ దినాలుగానే భావిస్తారు.

ప్రత్యేకించి కార్తీక శుక్ల ఏకాదశి నుండి పౌర్ణమి వరకు "పంచ పర్వాలుగా" భావించ బడతాయి. కార్తీక శుద్ధ ఏకాదశి – ఉత్థాన ఏకాదశి ప్రత్యేకత ననుసరించి, ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలు కార్తీక శుద్ధ ద్వాదశి వరకు గల నాలుగు మాసములు చాతుర్మాస్య వ్రతముగా చెప్పబడు చున్నవి. మహా విష్ణువు ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలు కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉండి, తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు ఉత్థానము చెందును కావున, దీనిని "ఉత్థాన ఏకాదశి" అని కూడా పిలుస్తారు. పీఠాధిపతులు, యతీశ్వరులు, మునులు ఈ వ్రతమును ఎంతో భక్తి శ్రద్ధలతో, ఆహార నియమాలతో చేయడం జరుగు తున్నది. కార్తీక శుద్ధ ఏకాదశి లేదా "ఉత్థాన ఏకాదశి" లేదా ప్రభోదనైకాదశి" అంటారు. ప్రబోధనైకాదశి నాడు విష్ణుమూర్తి క్షీరాబ్ధి నుండి బయలు దేరి "క్షీరాబ్ధి ద్వాదశి", "చిలుకు లేదా మదన ద్వాదశి", "యోగిని ద్వాదశి" నాడు విష్ణువు....లక్ష్మి. బ్రహ్మ మున్నగు వారితో కలిసి బృందావనంలో ప్రవేశిస్తాడు. దీనిని క్షీరసాగరాన్ని మధించిన చిలికిన దినంగా వ్యవహరిస్తారు. అమదేర్ జ్యోతిషీ గ్రంథ ప్రకారం చాతుర్మాస్య వ్రత సమాపనదినం. విష్ణు మూర్తికి ప్రీతిపాత్రమైనది కార్తీక శుద్ధ త్రయోదశి. విష్ణువు శంకరుడిని పూజించిన దినం "వైకుంఠ చతుర్దశి". ఇది జాగరణ వ్రతం, ప్రతిమావ్రతం, లింగ వ్రతం, ప్రబోధ వ్రతాలకు ఉద్దీపితమైనది. "కార్తీక పౌర్ణమి" శివునికి ప్రీతిపాత్రం. ముక్కంటి త్రిపురాసుడిని హత మార్చిన దినం. పార్వతి దేవి పాప పరిహా రార్థం శివారాధన చేసిన దినం. బౌద్ధులకు చాతు ర్మాస్య వ్రతారంభదినం.
ఇలా ఐదు దినాలను పంచ పర్వాలుగా ఆచరించడం సనాతన సాంప్రదాయాచారం. దేవాలయా లలో మూల విరాట్టుల అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, పూజలు చేస్తారు. భక్తులు ఆలయాల మధ్య గల ఉసిరిక వృక్షం చుట్టూ సాంప్రదాయ ప్రదక్షిణలు ఆచరించి, ఉసిరికలను దానం చేసుకుని కార్తీక దామోదరునికి ప్రత్యేక పూజలొన రిస్తారు. మంగళ స్నానాలాచరించి, దొప్పలలో వెలిగించిన కార్తీక దీపాలను వదిలి పెడతారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

వరదాయిని ఉత్థాన ఏకాదశి



కార్తీకశుద్ధ ఏకాదశికే ఉత్థాన ఏకాదశి, భోధన ఏకాదశి, దేవ ప్రబోధిని ఏకాదశి అని పేర్లు. ఆషాడ శుద్ధ ఏకాదశి, అంటే తొలి ఏకాదశి రోజున శయనించిన శ్రీమహావిష్ణువు ఈ ఏకాదశి రోజునే యోగనిద్ర నుండి మేల్కొనే రోజు కాబట్టి ఇది ఉత్థాన ఏకాదశిగా అయ్యింది. దీనినే హరి-భోధిని ఏకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి నాడు ప్రారంభమైన చాతుర్మాస్యవ్రతం ఈ ఏకాదశితో ముగుస్తుంది. మహాభారత యుద్ధంలో బీష్ముడు ఈ ఏకాదశినాడే అస్త్ర సన్యాసం చేసి, అంపశయ్య మీద శయనించాడు. యజ్ఞవల్క్య మహర్షి ఈరోజునే జన్మించారు. ఈ రోజున ఉపవాసం ఉండి, విష్ణువును పూజించి, రాత్రి అంతా జాగరణ చేసి, మరునాడు ద్వాదశి ఘడియలు ఉండగానే విష్ణుపూజ చేసి, పారణ చేసి (భోజనం చేసి) వ్రతాన్ని ముగించాలి. ఈ ఏకాదశి మహత్యాన్ని గురించి బ్రహ్మదేవునికి నారద మహర్షికి మధ్య జరిగిన సంభాషణ స్కందపురాణంలో కనిపిస్తుంది. ఉత్థాన ఏకాదశి పాపాలను హరిస్తుంది. 1000 అశ్వమేధ యాగాలు, 100 రాజసూయ యాగాలు చేసిన పుణ్యం లభిస్తుంది. కొండంత పత్తిని ఒక చిన్న నిప్పు రవ్వ ఎలా కాల్చి బూడిద చేస్తుందో అలా ఒక జీవుడు, తన వేల జన్మలలో చేసిన పాపాలను కాల్చి వేస్తుంది ఈనాటి ఏకాదశి ఉపవాస వ్రతం. ఈ రోజు చిన్న మంచిపని (పుణ్య కార్యం) చేసినా, అది మేరు పర్వతానికి సమానమైన పుణ్య ఫలితం ఇస్తుంది. ఈ ఏకాదశి వ్రతం చేసినవారికి సాధించ లేనివి ఏమి ఉండవు. ఈ రోజు ఉపవాసం ఉన్నవారికి ధాన్యం, సంపదలు, ఉన్నతస్థానం కలగడంతో పాటు పాపాపరిహారం జరుగుతుంది. పుణ్యక్షేత్ర దర్శనాలు, యజ్ఞ యాగాలు, వేదం చదవడం వల్ల కలిగిన పుణ్యానికి కోటిరెట్ల పుణ్యం ఒక్కసారైనా, ఈ ఏకాదశి ఉపవాస వ్రతం చేసినవారికి లభిస్తుంది" అని బ్రహ్మదేవుడు నారదునికి వివరించినట్లు పురాణ కథనం.
ఈ వ్రతంలో ఒకరికి చేసే అన్నదానం వలన సూర్య గ్రహణ సమయంలో పవిత్ర గంగాతీరాన కోటిమందికి అన్నదానం చేసినంత ఫలితం లబిస్తుంది. వస్త్రదానం చేయడం వలన, పండ్లు, దక్షిణతో కూడిన తాంబూలాన్ని పండితులకు ఇవ్వడం వలన ఈ లోకంలోనే గాక మరణానంతరం పరలోకం లో కూడా సర్వసుఖాలు లభిస్తాయి. ఈ రోజున బ్రహ్మాది దేవతలు, యక్షులు, కిన్నెరులు, కింపురుషులు, మహర్షులు, సిద్ధులు, యోగులు అందరూ విష్ణులోకం చేరి కీర్తనలతోనూ, భజనలతోనూ, హారతులతోనూ శ్రీమహావిష్ణువును నిద్రలేపు తారు. అందువల్ల ఉత్థాన ఏకాదశి రోజున ఎవరు శ్రీ మహావిష్ణువుకు హారతి ఇస్తారో వారికి అపమృత్యు దోషం తొలగి పోతుందని ధార్మిక గ్రంధాలు చెప్తున్నాయి. విష్ణుమూర్తికి హరతి ఇవ్వడం సాంప్రదాయం. ఏవైనా కారణాల వల్ల హారతి ఇవ్వడం కూడా కుదరక పోతే దేవాలయానికి వెళ్ళి. అక్కడ స్వామికి ఇచ్చే హారతిని కన్నులారా తిలకించి, వీలైతే స్వామికి హారతి కర్పూరం సమర్పించాలి. అపమృత్యు దోషం పరిహారం జరుగుతుంది. స్వామి అనుగ్రహం కలుగుతుంది.

- రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్
జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494..

శ్రోతల జీవితాలలో భాగాలు... బావగారి కబుర్లు



ఆకాశవాణి శ్రోతలకు చిర పరిచితులు ప్రయాగ నరసింహ శాస్త్రి. రేడియోనే ప్రధాన మనో రంజక సాధనంగా ఒకనాటి ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకున్న రోజులలో ప్రయాగ నిత్య విధి కార్యక్రమాలు శ్రోతల జీవిత భాగస్వాములు అయినాయంటే అతిశయోక్తి కాదేమో. ఆకాశ వాణి ప్రయోక్తగా, తెలుగు సినీ నటునిగా, హరికథకులుగా, రచయితగా, గాయకునిగా ప్రయాగ నరసింహ శాస్త్రి (నవంబరు 20, 1909 – సెప్టెంబరు 11, 1983) తెలుగు ప్రజలకు రేడియో ద్వారా చిర పరిచితులు.

తన ప్రత్యేక కంఠ స్వరంతో ఖంగుమని పలుకుతూ, జానపద శైలిలో పాడుతూ శ్రోతల్ని ఉర్రూత లూగించిన వ్యక్తి శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి. మూడు దశాబ్దాలు ఆకాశవాణిలో పనిచేసి ప్రశంసా పాత్రుడైన వ్యక్తి. 1936 లో ప్రయాగ ఆకాశవాణి మదరాసు కేంద్రంలో నిలయ విద్వాంసుడుగా చేరారు. 'బావగారి కబుర్ల ద్వారా ఆయన శ్రోతలకి చేరువయ్యారు. ఆయన, గాడేపల్లి సూర్య నారాయణతో కలిసి బావగారి కబుర్లు నిర్వహించే వారు. అవి శ్రోతల జీవనంలో భాగమై పోయాయి. "ఏమండోయ్ బావగారు రావాలి రావాలి" అనే పలకరింపులు సహజమయ్యాయి. స్నిగ్ధ లేకుండా యధాలాపంగా అనర్గళంగా తన సంభాషణలతో వినోదాన్ని అందించేవారు ప్రయాగ.

నరసింహశాస్త్రి 1909 నవంబర్ 20 న విశాఖపట్నం జిల్లా పెదగాడి గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యం నుండి సంగీత సాహిత్యాలపై అపారమైన ప్రీతి. విజయనగరం మహారాజా కళాశాలలో చదువు కొని పట్టభద్రులయ్యారు. శ్రీశ్రీ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ఆయన సహాధ్యాయులు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు వద్ద హరికథా గానంలో మెళకువలు నేర్చు కొన్నారు. చక్కని గాత్రము రూపము ఉన్న ప్రయాగ 1935లో చలన చిత్రరంగ ప్రవేశం చేశారు. భీష్మ చిత్రంలో విచిత్ర వీర్యుని పాత్రను పోషించారు. నాగయ్య గారి త్యాగయ్య చిత్రంలో గణపతి పాత్రను పోషించారు. అనేక చిత్రాలకు పాటలు వ్రాశారు. 1969లో ఆకాశవాణిలో పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ నటన పై ఆసక్తి తో చిత్రరంగంలో ప్రవేశించారు. చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం వంటి సినిమాలలో నటించారు.

ఆకాశవాణి మదరాసు కేంద్రంలో 1936 నుండి రెండు దశాబ్దాలు పని చేశారు. అక్కడ వీరు ప్రసారం చేసిన మొద్దబ్బాయ్ హెచ్.ఎం.వి. గ్రామఫోన్ రికార్డు కంపెని వారు రికార్డు చేసి విడుదల చేశారు. 20కి పైగా హెచ్.ఎం.వి. రికార్డులు ఆయన విడుదల చేశారు. శ్రోతలలో వీరికంత ప్రశస్తి వుండేది. 1956లో ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి బదలీ అయ్యారు. అక్కడ పింగళి లక్ష్మీకాంతం, బందా కనక లింగేశ్వర రావు, బాలాంత్రపు రజనీ కాంతారావు, జరుక్ శాస్త్రి, బాల మురళి, ఓలేటి వంటి పండితుల సాహచర్యం లభించింది.

విజయవాడలో ప్రయాగ గ్రామీణ కార్యక్రమాల ప్రయోక్తగా పనిచేశారు. ఎన్నో జానపద గేయాలను పాడి, పాడించి శ్రోతల మన్ననలందు కొన్నారు. హరికథలు స్వయంగా రచించి గానం చేశారు. త్యాగరాజ చరిత్ర, కన్యాకుమారి, గాంధీజీ, శంకర విజయం హరి కథలు ప్రముఖాలు. 1962లో భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సమక్షంలో గాంధీజీ బుర్రకథను వినిపించి బంగారు పతకంతో సన్మానించ బడ్డారు. ఆయన వివిధ బుర్రకథలు హెచ్.ఎం.వి. గ్రామఫోను రికార్డులుగా విడుదలైనాయి.

వినోదాల వీరయ్యగా విజయవాడ కేంద్రం నుండి ఎన్నో కార్యక్రమాలు సమర్పించారు. ఆకాశవాణిని ప్రయాగకు ఆరోప్రాణంగా భావించే వారు. 1969లో పదవీ విరమణ చేసేంత వరకు ఆయన ప్రయోక్తగా ఎన్నో కార్యక్రమాలు వెలువడ్డాయి. 1970 నుండి ఐదు సంవత్సరాలు కేంద్ర సంగీత నాటక అకాడమీ పక్షాన 'బాలాజీ ఆర్ట్ థియేటర్' పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. 1980 నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంగీత కళా పీఠంలో యక్షగానాలు, హరికథల అధ్యాపకులుగా పని చేశారు. హిందు ధర్మ ప్రచార పరిషత్ లో జానపద కళా ప్రచారకులుగా వ్యవహరించారు.

1983 సెప్టెంబరు 11న పరమ పదించారు. మాట, పాట, ఆటలతో శ్రోతల్ని సంబరపెట్టిన ప్రయాగ నిత్యోత్సాహి. ప్రయాగ నరసింహ శాస్త్రి కుమార్తె వేదవతి ఆకాశవాణిలో నిజామాబాద్ లో అసిస్టెంట్ స్టేషను డైరక్టరుగా సుపరిచితులు.

భీష్మ – విచిత్ర వీర్యుడు,
త్యాగయ్య – గణపతి, చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం తదితర చిత్రాలలో ఆయన నటించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

వేములవాడ నవంబర్ 19(సింగిడి)

ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సరిపడా తేమ శాతం వచ్చిన తర్వాతే తూకం వేయాలని సూచించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. పరిశీలనలో తహసీల్దార్ భూపతి, తదితరులు ఉన్నారు.

సీనియర్ జర్నలిస్టు తోట సుధాకర్ కు ఉత్తమ ప్రతిభా పురస్కారం



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 19(సింగిడి)

హనుమకొండకు చెందిన సీనియర్ జర్నలిస్టు, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్ కు మరోసారి ఉత్తమ ప్రతిభా పురస్కారం లభించింది. ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో ప్రజాపక్షం పత్రిక కార్యాలయంలో జరిగిన వార్షికోత్సవ సభలో జర్నలిస్టుగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను నగదు రివార్డుతో పాటు మెమెంటో, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి తోట సుధాకర్ ను సన్మానించి అభినందనలు తెలిపారు. నవచేతన విజ్ఞాన సమితి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం సంపాదకులు మక్కెన సుబ్బారావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బివిఎస్ఆర్ మోహన్ రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, నవచేతన గవర్నింగ్ బాడీ సభ్యులు కలవేన శంకర్,బొమ్మగాని ప్రభాకర్, నేదునూరి జ్యోతి, వివిఎస్ బోస్, ప్రజాపక్షం జనరల్ మేనేజర్ (యాడ్స్) వి. మదన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బి. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల వెంకటమ్మ, మల్లయ్యల జ్ఞాపకార్థం రాష్ట్ర స్థాయి పోటీలు

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 19 (సింగిడి)

కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపులే బాలుర పాఠశాలలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తల్లిదండ్రులైన ఈటల వెంకటమ్మ,మల్లయ్యల జ్ఞాపకార్థం 71వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల ,బాలికలకు బాల్ బాడ్మింటన్ పోటీలు ఈనెల 22 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ పబ్బు సతీష్,బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణ మీడియా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ ఈటల రాజేందర్ లు హాజరవుతారని అన్నారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి 10 జట్లు పాల్గొంటాయని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారిలో నుండి జాతీయ స్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేస్తారని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్,బండి కళాధర్,బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎరగట్ల స్వామి,సిరికొండ సుదర్శన్,రామకృష్ణారెడ్డి, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఏవియేషన్ ఒలింపియాడ్‌కు ఎంపిక



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 19 (సింగిడి):

జాతీయ స్థాయి ఏవియేషన్ ఒలింపియాడ్‌కు జిల్లాలోని ఇద్దరు కేజీబీవీ విద్యార్థులు ఎంపిక కాగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వారిని అభినందించారు. ఈ ఏడాది జాతీయ స్థాయి ఏవియేషన్ ఒలింపియాడ్‌లో దేశవ్యాప్తంగా 12,440కుపైగా పాఠశాలల నుంచి మొత్తం 2,09,280 మంది విద్యార్థులు హాజరుకాగా, జాతీయ స్థాయి ఫైనల్ పోటీలకు దేశవ్యాప్తంగా 145 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు మాత్రమే అర్హత సాధించారు.రాష్ట్రం నుంచి మొత్తం ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయి ఫైనల్‌కు ఎంపిక కాగా, వారిలో ఇద్దరు విద్యార్థినులు తంగళ్ల పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన అలూరి స్మిత – 9వ తరగతి, తోంటి రితీష – 10వ తరగతి విద్యార్థులు ఒలింపియాడ్‌లో నిర్వహించిన మూడు దశల పోటీలను విజయవంతంగా అధిగమించి జాతీయ స్థాయి ఫైనల్‌కు అర్హత సాధించగా, వారిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు న్యూఢిల్లీలో పాల్గొననున్న కేజీబీవీ తంగళ్ల పల్లి విద్యార్థినుల ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ సాగర్, జి సీ డీ ఓ పద్మజ తదితరులు ఉన్నారు.

భూముల రీసర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- భూముల రీ సర్వే, ఎస్ ఐ ఆర్, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు పై తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి
నవంబర్ 19 (సింగిడి):

జిల్లాలో భూముల రీసర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతి, ఎస్ ఐ ఆర్, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలోని ఆయా మండలాల్లో ఇప్పటివరకు రీ సర్వే చేపట్టిన గ్రామాలు, పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. గ్రామ హద్దులు, ప్రభుత్వ భూములు, అటవీ శాఖ భూములు, నీటి వనరుల రీ సర్వేపై అడిగి.. తహసీల్దార్లకు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామాల సరిహద్దు సర్వే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా చేపట్టాలని, భూములకు సంబంధించిన సమాచారం పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సర్వే చేసే విషయమై రైతులకు జీపీఓ లు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. రైతుల సమక్షంలో వారి భూముల రీ సర్వే చేసి.. ఆ వివరాలను వారికి తెలియజేసి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి, డీఐలు, తహసీల్దార్లు భూముల రీసర్వే చేపడుతున్న గ్రామాలలో పర్యటించి, ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. రీ సర్వే తో ఉపయోగాలపై అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన సమాచారం తప్పులు లేకుండా, పకడ్బందీగా సేకరించాలని ఆదేశించారు. రోజువారీగా పనులు చేపట్టి.. పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రత్యేక కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. ప్రక్రియ సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డీఐలు, తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 19(సింగిడి):

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ రిజిస్టర్లు, వైద్య రికార్డులు, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.జిల్లాలో సిజేరియన్ ప్రసవాల సంఖ్య అధికంగా ఉండటంపై డీఎంహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్ ప్రసవాల సంఖ్యను తగ్గించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాధారణ ప్రసవానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నప్పుడు సాధారణ ప్రసవానికే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తల్లి లేదా బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం ఉన్న వైద్యపరమైన పరిస్థితుల్లో మాత్రమే వైద్యుల సూచన మేరకు సిజేరియన్ ప్రసవం నిర్వహించాలని స్పష్టం చేశారు.అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బంది గర్భిణీ స్త్రీలకు సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. గర్భిణీలకు వైద్యుల సలహా మేరకు చేయాల్సిన తగిన వ్యాయామాలు, శారీరక చురుకుదనం, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, సాధారణ ప్రసవానికి అవసరమైన ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గర్భిణీకి గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, సాధారణ ప్రసవాలపై ఉన్న అపోహలను తొలగించి, కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది సహా ప్రతి ఒక్కరూ తమ హాజరును తప్పనిసరిగా 'మీ ప్రమాణం' యాప్' ద్వారానే నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, తల్లి, బిడ్డ ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అనవసరమైన సిజేరియన్ ప్రసవాలను నివారించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు.ఇట్టి కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీప్తి, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నీటి ఎద్దడిని అధిగమించేందుకు ఆరుతడి పంటలే శరణ్యం

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 19 (సింగిడి):

యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసి నీటి ఎద్దడిని అధిగమించాలని కూనారం పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర, రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి. కిరణ్ రైతులకు పిలుపునిచ్చారు. 'ఖేతి బచావో అభియాన్' ఆరుతడి పంటల సాగుపై గురువారం ఎలిగేడు లో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్త సతీష్ చంద్ర మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు వరికి బదులుగా మొక్కజొన్న, శనగ, పొద్దుతిరుగుడు, పెసర వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఆరుతడి పంటల యాజమాన్య పద్ధతులను వివరిస్తూ, 'ఫాస్పరస్ సాలిబులైజింగ్ బ్యాక్టీరియా' వాడటం వల్ల భూమిలో మొక్కలకు అందుబాటులో లేని భాస్వరం కరిగి, పంటకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం రైతులకు పీఎస్బీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రామగిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ పి. కిరణ్ మాట్లాడుతూ.. 'ఖేతి బచావో అభియాన్' కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు. రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, రసాయన ఎరువులను విచక్షణారహితంగా వాడకుండా సమతుల్య పద్ధతిలో దఫదఫాలుగా వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, ఏఏంసీ చైర్మన్ రమేష్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, సర్పంచులు ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, వ్యవసాయ అధికారి (ఏవో) ఉమాపతి, పశువైద్యాధికారి డాక్టర్ గంగా ప్రసాద్, ఏఈవోలు సురేష్, అభిలాష్ స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ

వేములవాడ నవంబర్ 19(సింగిడి):

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బహుజన సేన తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కదిరే కృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ మహాసభకు సంబంధించిన పోస్టర్లను, భారత రాజ్యాంగ ముఖ్యాంశాలతో కూడిన పుస్తకాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా వేములవాడ పట్టణ కేంద్రంలో ఆవిష్కరించారు. అదేవిధంగా వేములవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులను కలిసి మహాసభ పోస్టర్లను అందజేసి సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించిందని అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఎంతో దూరదృష్టితో, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలనే ఆశయంతో భారత రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. రాజ్యాంగం దేశ ప్రజలకు రక్షణ కవచంగా నిలుస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా ఉందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, విధులు, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా నేటి యువత, విద్యార్థులు రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి అందులో పొందుపరిచిన హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించడంతో పాటు రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. సమాజంలో కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, అవకాశాలు లభించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యంపరిఢవిల్లుతుందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు, దళితులు, బహుజనులు, మహిళలు, అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై చైతన్యం కల్పించడమే ఈ మహాసభ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ మహాసభకు న్యాయవాదులు, మేధావులు, విద్యావంతులు, ప్రజాస్వామ్యవాదులు, బహుజన సంఘాల నాయకులు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని జింక శ్రీధర్ కోరారు. రాజ్యాంగ ఆశయాల సాధనకు, అంబేద్కర్ ఆలోచనల ప్రచారానికి ఈ మహాసభ వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం వేములవాడ డివిజన్ అధ్యక్షులు దుమ్మ ఆనంద్, న్యాయవాదులు సంఘం అధ్యక్షులు పిట్టల మనోహర్, మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, పొత్తూరి అనిల్ కుమార్, న్యాయవాదులు సత్యనారాయణ రెడ్డి, కందుల క్రాంతి కుమార్, గోయికారి శ్రీనివాస్, నక్క దివాకర్, బహుజన సేన గౌరవాధ్యక్షులు గుడిసె మనోజ్ కుమార్, యువ చైతన్య దీపం ఫౌండేషన్ చైర్మన్ శేఖర్ సేనాపతి, అలువాల రాము, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్, అదుపులోకి నలుగురు బాలురు
- రూ.18.44 లక్షల విలువైన 84 విద్యుత్ మోటార్లు, వాహనాలు స్వాధీనం

వరంగల్ క్రైమ్ ప్రతినిధి నవంబర్ 19 (సింగిడి)

వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నీటి మోటార్లను అపహరిస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను నర్సంపేట పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, మరో నలుగురు బాలురను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.18,44,800 విలువైన 84 విద్యుత్ నీటి మోటార్లతో పాటు, దొంగతనాలకు ఉపయోగించిన నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో నర్సంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ రాజన్ బాబు తన సిబ్బందితో కలిసి రాజుపేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వరంగల్ స్పోలీసుల సహకారంతో విచారించగా, నిందితులు డీజే ఆపరేటర్లుగా, స్టేజ్ డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు వెల్లడైంది. జల్సాలకు అలవాటుపడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, చెన్నారావుపేట, ఖానాపూర్, నెక్కొండ, ములుగు మండలాల పరిధిలోని శివారు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నీటి మోటార్లను దొంగిలిస్తున్నట్లు విచారణలో అంగీకరించారు.దొంగిలించిన మోటార్లను విక్రయించేందుకు రాజుపేట గ్రామ శివారులోని చెట్ల పొదల్లో దాచిపెట్టినట్లు నిందితులు వెల్లడించడంతో పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 84 విద్యుత్ నీటి మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.రైతులకు పోలీసుల సూచన:రైతులు తమ వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సూచించారు. గ్రామ శివారు ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినా, మోటార్ల దొంగతనాలు జరిగినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. దొంగతనాల నివారణకు పోలీసులకు సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఈస్ట్ జోన్ డిసిపి నగదు రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఏసీబీ రవీందర్ రెడ్డి, నర్సంపేట ఇన్స్పెక్టర్ ముస్కా శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్ రాజన్ బాబు సిసిఎస్ ఇన్స్పెక్టర్ లు హరికృష్ణ రాఘవేందర్రావు, సిబ్బంది పాల్గొన్నారు,

ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కరీంనగర్,
నవంబర్19(సింగిడి)



ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను విర మించుకోవాల ని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేస్తూ చిన్న పాఠశాలలు, కళాశాలలకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు.9 నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యాసంస్థకు అనుమతులు ఇస్తే ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో ప్రవేశాలు పొంది పరీక్షలు రాసే అవకాశం ఉందని, స్థానికత విషయంలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 55 ఏళ్ల చరిత్ర కలిగిన ఇంటర్మీడియట్ బోర్డు వ్యవస్థను ఏక పక్షంగా రద్దు చేయడం సరికాదన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అఖిలపక్షాలు, విద్యావేత్తలు, అధ్యాపకులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని బండారి శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభకు వేములవాడ కాంగ్రెస్ శ్రేణులు



వేములవాడ నవంబర్ 19(సింగిడి)

వేములవాడ :రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిద్దిపేటలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు వేములవాడ పట్టణం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు, ఆది శ్రీనివాస్ నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ సభను విజయవంతం చేయడానికి తరలివెళ్లినట్లు తెలిపారు.

ఘనంగా సంఘ స్వామి పుట్టినరోజు

వేములవాడ నవంబర్ 19(సింగిడి)

వేములవాడ కాంగ్రెస్ నాయకుకుడు సంఘ స్వామి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణ మున్నూరు కాపు ఉమ్మడి కుల సంఘుల అధ్యక్షులు ఇప్పపూల అజయ్,మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోచెట్టి శంకర్ శాలువాతో ఘన సత్కారం చేశారు భవిష్యత్తులో సంఘ స్వామి మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు వీరికి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ మున్నూరు కాపు ఉమ్మడి కుల సంఘుల అధ్యక్షులు ఇప్పపూల అజయ్ మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోచెట్టి శంకర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు





వీహెచ్‌పీ నూతన కార్యవర్గం

కరీంనగర్, నవంబర్ 19(సింగిడి)

హిందూ ధర్మ పరిరక్షణకు సమాజమంతా సంఘటితంగా పనిచేయాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మల సత్యం పిలుపునిచ్చారు. గురువారం తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్‌లోని శ్రీ తపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా గాశివనాధుల శ్రీనివాస్, కార్యదర్శిగా కుమ్మరాజుల హరీష్, బజరంగ్‌దళ్ మండల సంయోజక్‌గా వకళాభరణం మాధవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గుమ్మల సత్యం మాట్లాడుతూ సమాజ హితం, సేవా కార్యక్రమాలు, ధర్మ పరిరక్షణే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో ప్రాంత సేవా ప్రముఖ్ కోమల రాజేందర్ రెడ్డి, విభాగ్ కార్యదర్శి అయోధ్య రవి, జిల్లా కార్యదర్శి ఉప్పుల శ్యామ్‌తో పాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ పరిధిలోని భూములను కాపాడాలి

వేములవాడ నవంబర్ 19(సింగిడి)



వేములవాడ పట్టణంలో గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు, నగర పంచాయతీగా మారిన తరువాత చాలా భూములు లెక్క లేకుండా పోయాయి. పట్టణం అభివృద్ధి చెందుతున్న తరుణంలో, భూకబ్జాదారులు లేఅవుట్ భూములను కబ్జా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. విలీన గ్రామాలైన కొనాయపల్లి, నాంపల్లి, శాత్రాజ్ పల్లి లో ఉన్న వెంచర్ల భూములను కమిషనర్ పరిశీలించి, ఒక కమిటీ వేసి వెంటనే కబ్జా చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోతు అనిల్ కుమార్ కోరారు. కమిషనర్ వెంటనే వీటిపై చర్యలు తీసుకోని పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం" అని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తే అర్ధరాత్రి అరెస్టులా?

సిద్దిపేట,నవంబర్ 19, (సింగిడి):

రేవంత్ రెడ్డి ప్రజలకు మేలు చేస్తే మమల్ని అక్రమ అరెస్టులు చేసుడు ఎందుకు అని నాయకులు ప్రశ్నించారు. అప్పటి, ఇప్పటి ప్రభుత్వం రెండు కూడా సిద్దిపేట చేసింది శూన్యమన్నారు. విద్యార్థులను, రైతులను మోసం చే, ఇచ్చిన హామీలు ఒకటి కూడా నెరవేర్చకుండా అప్పటి పార్టీ ఇప్పటి అధికారంలో వున్నా కాంగ్రెస్ పార్టీ రెండు కూడా ఒకే విధానం అవలంబిస్తూ అధికారానికి ఎలా దూరం అయిందో ఇప్పుడు కాంగ్రెస్ కూడా అధికారం దూరం అవుతుందని హెచ్చరించారు. అక్రమ అరెస్టులతో ప్రశ్నించే వారిని అడ్డుకోలేరని బీజేపీ నాయకుడు తాటికొండ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు.

జిల్లాస్థాయి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ క్విజ్, వ్యాసరచన పోటీలు

సిద్దిపేట,నవంబర్ 19, (సింగిడి):

విద్యార్థుల్లో ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఓటరు బాధ్యతలపై అవగాహన పెంపొందించేందుకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (కో–ఎడ్)లో జిల్లా స్థాయి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సిద్దిపేట జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీల ద్వారా భారత రాజ్యాంగం, ఎన్నికల విధానం, ప్రజాస్వామ్య విలువలు, ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యత తదితర అంశాలపై విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరీక్షించారు. వ్యాసరచన పోటీలలో ప్రజాస్వామ్యంలో యువత పాత్ర, బాధ్యతాయుతమైన ఓటరు ప్రాధాన్యత, ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను వ్యక్తపరిచారు. ఈ పోటీలలో మొదటి బహుమతి సాధించిన విద్యార్థులకు రూ.1,000, రెండవ బహుమతి సాధించిన విద్యార్థులకు రూ.500 నగదు బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. జిల్లా స్థాయి నోడల్ అధికారి, సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కాకా మాధవరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాముఖ్యత, ఎన్నికల నిర్వహణలోని బాధ్యతలు, వివిధవిధానాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. యువతలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. ప్రమీల , సిద్దిపేట ఆర్డీఓ శ్రీ సదానందం,మండల విద్యాధికారి రాజా ప్రభాకర్ రెడ్డి, న్యాయనిర్ణేతలు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ .మామిడాల శ్రీనివాస్, దరిపల్లి నగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

- సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ విజ్ఞప్తి

పేదల సంక్షేమమే లక్ష్యం..వచ్చే ఏడాది 2 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



సిద్దిపేట ప్రతినిధి,
నవంబర్ 19, (సింగిడి):

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేశామని, వచ్చే ఏడాది మరో 2 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. గత పదేళ్లలో కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4 లక్షల కొత్త చేయూత పెన్షన్లు అందించిందని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులకు పెన్షన్లు అందించినప్పుడు వారి ముఖాల్లో కనిపించిన ఆనందం ప్రభుత్వానికి ఎంతో సంతృప్తినిస్తోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రూ.13 వేల కోట్ల వ్యయంతో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిందన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాలను సవరించామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో రూ.4,500 కోట్ల వ్యయంతో అన్ని నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నిర్వాసితులకు పరిహారం..
మున్సిపాలిటీకి నిధులు

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని ఈసారైనా ప్రకటించి బాధితులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు మంత్రి తెలిపారు. సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు కేటాయించాలని సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యమివ్వాలని ఆకాంక్షించారు.

ప్రతీ అర్హత కుటుంబానికి జీవిత బీమా భరోసా కల్పించాలి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యేక దృష్టి

డిసెంబర్ 18 వరకు అర్హుల వివరాల నమోదు
గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు

కామారెడ్డి, నవంబర్ 19: (సింగిడి)



జిల్లాలోని ప్రతి అర్హ కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా పథకానికి దూరం కాకుండా సమగ్రంగా వివరాలు సేకరించి నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పథకం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులైన కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు.ఈ నెల 20వ తేదీ నుంచి డిసెంబర్ 18వ తేదీ వరకు వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం నవీకరించిన వెబ్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, అధికారులు ఆ అప్లికేషన్ ద్వారా అర్హుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.అర్హులెవరూ మిగిలిపోకూడదుప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా అందించేందుకు క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా సమన్వయంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించడంతో పాటు ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దేశించిన గడువులోగా వివరాల సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు.ఇతర బీమా పథకాలు యథాతథంప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర బీమా పథకాలు యథాతథంగా కొనసాగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓలు రవీందర్ రెడ్డి, ప్రభాకర్, ఇడియం ప్రవీణ్, మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ బీమా కోసం 32 ప్రత్యేక శిబిరాలు

కరీంనగర్, నవంబర్19(సింగిడి)

రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని నగరంలో సమర్థంగా అమలు చేసి అర్హులందరికీ ప్రయోజనం కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో శుక్రవారం నుంచి నగరంలోని 66 డివిజన్ల పరిధిలో 32 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ప్రారంభించాలని సూచించారు.సుమారు 30 రోజుల పాటు జరిగే శిబిరాల్లో ఉదయం 8 గంటల నుంచే దరఖాస్తులు స్వీకరించనున్నారు. 18 నుంచి 59 ఏళ్లలోపు కుటుంబ యజమానులు ఆధార్, రేషన్ కార్డు, సెల్‌ఫోన్ నంబరు, కుటుంబ సభ్యుల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ పథకం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఉప కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, సహాయ కమిషనర్ రాజమనోహర్, ఈఈ లచ్చిరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

భిక్కనూర్ గురుకుల పాఠశాలలో ఆహార భద్రతాధికారి తనిఖీలు

కామారెడ్డి ప్రతినిధి , నవంబర్ 19:సింగిడి



విద్యార్థులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా కామారెడ్డి జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం భిక్కనూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల (COE) వంటగదిని జిల్లా ఆహార భద్రతా అధికారి జి. విక్రమ్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వంటగది పరిసరాలను, ఆహార తయారీ విధానాలను పరిశీలించారు. వంట సిబ్బంది, కార్మికులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వంటగది ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంచాలని మెస్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆహార నాణ్యతపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో అనుమానిత ఆహార నమూనాలను సేకరించారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడిన అధికారితనిఖీల్లో భాగంగా విద్యార్థుల మెస్ కమిటీ సభ్యులతో ఆహార భద్రతాధికారి ముఖాముఖి మాట్లాడి భోజనం నాణ్యత, వంటకాల తయారీ, పరిశుభ్రత తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు హాస్టల్‌లోనే కాకుండా బయట ఆహారం తీసుకునే సమయంలోనూ పాటించాల్సిన ఆహార భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు చేశారు.నిబంధనలు పాటించాల్సిందే..విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార సరఫరా విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, ఆహార భద్రతా నిబంధనలను క్రమం తప్పకుండా పాటించాలని పాఠశాల యాజమాన్యం, మెస్ కాంట్రాక్టర్‌కు అధికారి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించే బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని స్పష్టం చేశారు.గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ తనిఖీ మరోసారి గుర్తు చేసింది.

చలో కరీంనగర్ దీక్షా దివస్ విజయవంతం చేయాలి

-బీఆర్ఎస్ సన్నాహక సమావేశం పిలుపు
హాజరైన ఎమ్మెల్సీ ఎల్ రమణ, నాఫ్స్ క్యాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు తోట ఆగయ్య

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 19 (సింగిడి):





నవంబర్ 29న కరీంనగర్ లో నిర్వహించనున్న "దీక్ష దివాస్" కార్యక్రమానికి సిరిసిల్ల నుండి భారీ సంఖ్యలో తెలంగాణ వాదులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లి "చలో కరీంనగర్–దీక్షా దివాస్" సభను విజయవంతం చేయాలని సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి లు పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ లో సిరిసిల్ల పట్టణ శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి అధ్యక్షతన దీక్షా దివాస్ "చలో కరీంనగర్" కార్యక్రమం విజయవంతం చేయాలని సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశ అధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసనమండలి సభ్యులు ఎల్.రమణ, నాఫ్స్ క్యాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, కరీంనగర్ మాజీ జెడ్పి చైర్మన్ తుల ఉమా, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ దార్ల సందీప్, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపల్లి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సెస్ డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ టీం విజయం



సిద్దిపేట,నవంబర్ 19, (సింగిడి):

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న 70వ జాతీయస్థాయి అండర్ 19 బాలికల సాఫ్ట్ బాల్ పోటీలు చండీగఢ్ లో జరుగుతున్నాయి. మొదటి లీగ్ లో తెలంగాణ జట్టు ఆంధ్రప్రదేశ్ తో తలపడగా ఇందులో తెలంగాణ జట్టు 9–3 పాయింట్ల తేడాతో విజయం సాధించడం జరిగింది. రెండవ లీగ్ లో తెలంగాణ జట్టు మధ్యప్రదేశ్తో తలపడగా ఇందులో 18–14 పాయింట్ల తేడాతో విజయం సాధించడం జరిగింది. రేపు ఛత్తీస్గఢ్ తో తెలంగాణ జట్టు మూడో లీగ్ ఆడనుంది. ఈ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటున్న తెలంగాణ జట్టును సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీల నుండి క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్బాల్ టీం మేనేజర్ మంతెన సమ్మయ్య తెలిపారు.



భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం

వేములవాడ నవంబర్ 19 (సింగిడి):



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, బుధవారం 9వ రోజు వేడుకలను ఆలయ పర్యవేక్షకులు నూగురి నరేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు మరియు శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు అర్చకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన...ప్రారంభోత్సవాలు

సిద్దిపేట, నవంబర్ 19 (సింగిడి):



జిల్లాలో విద్య, రెవెన్యూ, విద్యుత్ రంగాలను బలోపేతం చేసే లక్ష్యంతో రూ.451.13 కోట్లతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి రూ.200 కోట్ల వ్యయంతో (2)యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం, ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.15.44 కోట్లు, ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.13.50 కోట్లు కేటాయించారు. దౌల్తాబాద్ మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ.7.80 కోట్లు, చిన్నకోడూరు మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ.7.50 కోట్లు, జనగామ నియోజకవర్గంలో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.6.89 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. రూ.92.98 కోట్లతో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పూర్తయిన పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సిద్దిపేట జిల్లాలో 14 విద్యుత్ సబ్‌స్టేషన్లు రూ.54.67 కోట్లు. , కొమురవెల్లి మల్లన్న ఆలయ సత్రం రూ.14.35 కోట్లతో నిర్మించారు. క్యూ కాంప్లెక్స్ రూ.12 కోట్లతో నిర్మించారు. రూ.6.50 కోట్లతో 53 గ్రామ సంఘాల భవనాలు, రూ.3.87 కోట్లతో రాయపోల్ మండలంలో నూతన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం, రూ.1.59 కోట్లతో గజ్వేల్‌లో విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని నిర్మించారు. రాష్ట్ర రెవెన్యూ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ , సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, రవాణా శాఖ , బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాల్, చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కూజల హరికృష్ణ అంతకు ముందు ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికారు.

సీఎం సభలో చౌదరిపల్లి రైతుల ఆందోళన



సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 19 (సింగిడి):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న బహిరంగ సభలో చౌదరిపల్లి రైతులు తమ నిరసన గళాన్ని వినిపించారు. దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట–భూంపల్లి మండలం చౌదరిపల్లికి చెందిన సుమారు 120 బాధిత రైతు కుటుంబాలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.గ్రామంలోని సర్వే నంబర్ 294లో ఉన్న 175 ఎకరాల భూమిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆక్రమించారని రైతులు ఆరోపించారు. తమ భూములను తమకు అప్పగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మా భూములు మాకు కావాలి ఎంపీ రఘునందన్ రావు డౌన్ డౌన్' అంటూ బాధితులు నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి సభకు వచ్చిన సందర్భంగా తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రైతులు నిరసన తెలిపారు. భూముల వివాదంపై ప్రభుత్వం విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు కోరారు.

హుస్నాబాద్‌ను తిరిగి కరీంనగర్‌లో కలపాలి



మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 19, (సింగిడి):

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. గౌరవెల్లి, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ, పరిహార సమస్యలను పరిష్కరించి బాధిత రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన రైతు కుటుంబాలకు ఇంకా పరిహారం అందాల్సి ఉందని, పెండింగ్ నిధులను మంజూరు చేసి నిర్వాసితుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. గతంలో కరీంనగర్ జిల్లాలో భాగంగా ఉన్న హుస్నాబాద్‌ను జిల్లాల పునర్విభజన సమయంలో సిద్దిపేట జిల్లాలో కలిపారని మంత్రి గుర్తుచేశారు. భవిష్యత్తులో జిల్లాల పునర్విభజన చేపడితే హుస్నాబాద్‌ను తిరిగి కరీంనగర్ జిల్లాలో చేర్చాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

మూర్ఛ వస్తే కంగారు పడొద్దు

మన కళ్లముందే ఎవరైనా అకస్మాత్తుగా కిందపడిపోయి, శరీరం వణుకుతూ, స్పృహ కోల్పోతే చుట్టుపక్కల ఉన్నవారు ఆందోళనకు గురవుతారు. ఏం చేయాలో తెలియక కొందరు పొరపాట్లు కూడా చేస్తుంటారు. ముఖ్యంగా మూర్ఛ (ఎపిలెప్సీ) వచ్చినప్పుడు బాధితుడికి సరైన ప్రథమ చికిత్స అందించడం చాలా ముఖ్యం. ఆ సమయంలో తీసుకునే చిన్న జాగ్రత్తలు కూడా గాయాల ప్రమాదాన్ని తగ్గించగలవు. మరి అలాంటి పరిస్థితి ఎదురైతే ఏం చేయాలి? ఏం చేయకూడదు? తెలుసుకుందామా..



ముందుగా బాధితుడిని సురక్షితంగా ఉంచాలి
ఎవరైనా మూర్ఛతో కిందపడిపోతుంటే వీలైతే జాగ్రత్తగా పట్టుకుని నేలపై పడుకోబెట్టాలి. చుట్టుపక్కల ఉన్న పదునైన వస్తువులు, ఫర్నిచర్‌ను దూరంగా జరపాలి. తద్వారా శరీరం వణుకుతున్న సమయంలో తలకు, చేతులకు, కాళ్లకు గాయాలు కాకుండా చూడవచ్చు.

తల కింద మెత్తని వస్తువు ఉంచాలి
బాధితుడి తల కింద మెత్తని వస్తువు ఉంచాలి. మెడ చుట్టూ బిగుతుగా ఉన్న దుస్తులను వదులు చేయాలి. వీలైతే బాధితుడిని పక్కకు తిప్పి పడుకోబెట్టాలి. ఇలా చేయడం వల్ల నోటిలోని లాలాజలం బయటకు వెళ్తుంది. అయితే శరీరం బాగా వణుకుతున్నప్పుడు బలవంతంగా కదిలించకూడదు.

మూర్ఛ వచ్చిన సమయాన్ని గమనించాలి
మూర్ఛ ఎప్పుడు ప్రారంభమైందో సమయాన్ని గుర్తుంచుకోవాలి. ఎంతసేపు కొనసాగిందో గమనించాలి. బాధితుడికి స్పృహ తిరిగి వచ్చే వరకు అతడి పక్కనే ఉండాలి. మూర్ఛ తగ్గిన తర్వాత కూడా కొంతసేపు గందరగోళంగా లేదా అలసటగా ఉండవచ్చు. పూర్తిగా తేరుకునే వరకు బాధితుడు ప్రశాంతంగా ఉండేలా సహాయం చేయాలి.

ఈ పొరపాట్లు అస్సలు చేయకూడదు
మూర్ఛ వచ్చినప్పుడు బాధితుడు నాలుకను మింగేస్తాడనే అపోహ చాలామందిలో ఉంది. అందుకే కొందరు నోట్లో వేళ్లు, చెంచాలు, గుడ్డలు పెట్టేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. అలా చేయడం వల్ల బాధితుడికి, సహాయం చేస్తున్న వ్యక్తికి కూడా గాయాలు కావచ్చు.
శరీరం వణుకుతున్నప్పుడు చేతులు, కాళ్లను గట్టిగా పట్టుకుని ఆపే ప్రయత్నం చేయకూడదు.
స్పృహ పూర్తిగా రాకముందు నీళ్లు, ఆహారం లేదా మందులు ఇవ్వకూడదు.

బలవంతంగా కదిలించకూడదు
ఎప్పుడు అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి?
కొన్ని సందర్భాల్లో మూర్ఛ ప్రాణాపాయ పరిస్థితికి దారితీయవచ్చు. ముఖ్యంగా ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి.
మూర్ఛ ఐదు నిమిషాల కంటే ఎక్కువసేపు కొనసాగడం

స్పృహ రాకముందే మళ్లీ మూర్ఛ రావడం
శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడం
మూర్ఛ సమయంలో తీవ్రంగా గాయపడడం
జీవితంలో మొదటిసారి మూర్ఛకు గురికావడం

సన్ రైస్.. డోంట్ మిస్..



రోజూ ఉదయం సూర్యరశ్మిలో సుమారు 30 నిమిషాలు గడపడం వల్ల మానసిక స్థితిలో మార్పులు రావడంతో పాటు నిద్రకు సంబంధించిన సమస్యలు తగ్గడానికి, ఒత్తిడిని నియంత్రించుకోవడానికి సహాయపడుతుందని చెబుతున్నారు.
సూర్యరశ్మి మన శరీరంలో కొన్ని హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. మరి ఉదయం ఎండలో కూర్చోవడం వల్ల మానసిక ఆరోగ్యానికి ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో తెలుసుకుందాం.

మానసిక స్థితి మెరుగుపడుతుంది
సూర్యరశ్మి మన శరీరంలో విటమిన్ డి ఉత్పత్తికి సహాయపడుతుంది. ఈ విటమిన్ శరీరంలోని అనేక ముఖ్యమైన ప్రక్రియల్లో పాల్గొంటుంది. అలాగే సూర్యరశ్మి మన మెదడులో మానసిక స్థితిని ప్రభావితం చేసే సెరోటోనిన్ వంటి రసాయనాల నియంత్రణతో సంబంధం కలిగి ఉంటుంది.
సెరోటోనిన్ మన మూడ్, భావోద్వేగాలు, ప్రశాంతకు సంబంధించిన హార్మోన్. తగినంత వెలుతురు అందడం వల్ల మానసిక స్థితి మెరుగుపడటానికి సహాయపడుతుంది. ముఖ్యంగా ఎక్కువ సమయం ఇంట్లోనే ఉండేవారు, బయటకు వెళ్లని వారు ఉదయం కొంత సమయం సహజ వెలుతురులో గడపడం వల్ల మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చు.

ఒత్తిడి, ఆందోళన తగ్గడానికి ..
రోజంతా పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, ఇతర సమస్యలతో చాలామంది మానసికంగా అలసిపోతుంటారు. ఇలాంటి సమయంలో ఉదయం ప్రశాంతమైన వాతావరణంలో సూర్యరశ్మిని ఆస్వాదించడం, ప్రకృతితో కొంత సమయం గడపడం మనసుకు విశ్రాంతిని అందిస్తుంది.
సూర్యరశ్మి మన శరీరంలోని జీవ గడియారాన్ని ప్రభావితం చేయడంతో పాటు మానసిక స్థితిని నియంత్రించే ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఉదయం ఎండలో కాసేపు కూర్చోవడం లేదా నడవడం వల్ల రోజును ప్రశాంతంగా ప్రారంభించడానికి సహాయపడుతుంది. ఇది ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది.

నిద్ర చక్రం మెరుగుపడుతుంది
సూర్యరశ్మి మన నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఉదయం సహజ వెలుతురు మన శరీరానికి పగలు ప్రారంభమైందనే సంకేతాన్ని అందిస్తుంది. దీనివల్ల నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి సమయంపై ప్రభావం పడుతుంది.

ఉదయం ఎండలో ఎంతసేపు ఉండాలి?
ఉదయం కొంత సమయం సహజ వెలుతురులో గడపడం మంచిదే. అయితే ప్రతిరోజూ కచ్చితంగా 30 నిమిషాలు ఎండలో కూర్చోవాలని అందరికీ ఒకే విధంగా చెప్పలేం. సూర్యరశ్మి తీవ్రత, వాతావరణం, చర్మ స్వభావం, ఆరోగ్య పరిస్థితులను బట్టి ఎంతసేపు ఎండలో ఉండాలనేది మారుతుంది.
మరీ ఎక్కువ సేపు ఎండలో ఉండటం వల్ల చర్మానికి హాని కలిగే ప్రమాదం ఉంది. కాబట్టి సూర్యరశ్మిని ఆస్వాదించేటప్పుడు చర్మ రక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. ఉదయం ఎండలో కాసేపు నడవడం, బాల్కనీలో కూర్చోవడం లేదా మొక్కల దగ్గర ప్రశాంతంగా సమయం గడపడం మంచి అలవాటు.
గమనిక: సూర్యరశ్మి మానసిక ఆరోగ్యానికి తోడ్పడవచ్చు. అయితే డిప్రెషన్, తీవ్రమైన ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలకు సూర్యరశ్మి మాత్రమే చికిత్స కాదు. సమస్యలు ఎక్కువగా ఉంటే వైద్య నిపుణులను సంప్రదించాలి.

అతివ Athiva Singidi

డ్రాగన్ ఫ్రూట్‌లో ఏది బెస్ట్?



డ్రాగన్ ఫ్రూట్‌లో ఎరుపు, తెలుపు రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. రెండింటిలోనూ నీరు, ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉంటాయి. అయితే ఎరుపు, తెలుపు డ్రాగన్ ఫ్రూట్‌లో ఏది ఆరోగ్యానికి మంచిదో తెలుసుకుందాం..

ఎరుపు-తెలుపు డ్రాగన్ ఫ్రూట్‌లో ఏది బెస్ట్?
ఇటీవల కాలంలో డ్రాగన్ ఫ్రూట్ తినేవారి సంఖ్య పెరుగుతోంది. బయట గులాబీ లేదా ఎరుపు రంగు తొక్క, లోపల చిన్న నల్ల గింజలతో ఉండే ఈ పండు సాధారణంగా ఎరుపు, తెలుపు గుజ్జు రకాలలో లభిస్తుంది. ఈ రెండు రకాలలోనూ నీరు, పీచుపదార్థం, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉంటాయి. అయితే రంగు, రుచి, కొన్ని పోషకాల పరంగా స్వల్ప తేడాలు ఉండొచ్చు. అయితే ఎరుపు, తెలుపు డ్రాగన్ ఫ్రూట్‌లలో ఏది ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుంది? తెలుసుకుందాం..

ఎరుపు డ్రాగన్ ఫ్రూట్
ఎరుపు డ్రాగన్ ఫ్రూట్‌లో బీటాసైనిన్ వంటి సహజ వర్ణద్రవ్యాలు, యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడవచ్చు. డ్రాగన్ ఫ్రూట్‌కు ఎరుపు రంగు రావడానికి ఈ సహజ వర్ణద్రవ్యాలే కారణం.

తెల్ల డ్రాగన్ ఫ్రూట్
తెల్లటి డ్రాగన్ ఫ్రూట్ సాధారణంగా తేలికపాటి, తియ్యటి రుచిని కలిగి ఉంటుంది. ఇందులో నీరు, పీచుపదార్థం, విటమిన్లు వంటి పోషకాలు ఉంటాయి. ఇందులోని పీచుపదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి సహాయపడటంతో పాటు మలబద్ధకాన్ని నియంత్రించడంలో తోడ్పడుతుంది.

ఎరుపు-తెలుపు.. ఏది మంచిది?
ఎరుపు, తెలుపు డ్రాగన్ ఫ్రూట్‌లలోనూ ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు ఉన్నాయి. ఎరుపు డ్రాగన్ ఫ్రూట్‌లో కొన్ని యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఎక్కువగా ఉండొచ్చు. తెల్లటి రకం కూడా పీచుపదార్థం, నీటికి మంచి వనరుగా ఉంటుంది. మీ ఆహారంలో భాగంగా ఎరుపు లేదా తెలుపు.. ఏ రంగు డ్రాగన్ ఫ్రూట్ అయినా మితంగా తీసుకోవడం ముఖ్యం. అయితే జ్యూస్‌గా తీసుకోవడం కంటే పండును నేరుగా తినడం వల్ల పీచుపదార్థం కూడా లభిస్తుంది. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు పండ్లను తీసుకోవడం మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

స్టాక్ మార్కెట్ Stock Market

వరుసగా రెండో రోజూ బంగారం, వెండి ధరలు ఢమాల్..



బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా భారీగా తగ్గాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు పడిపోతున్నాయి. ఈ రోజు (గురువారం) దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.2,570 తగ్గగా.. 22 క్యారెట్ల బంగారంపై రూ.2,350 మేర ధర తగ్గింది. మరోవైపు వెండి ధర కూడా భారీగా పడిపోయింది. కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో కొనుగోలుదారులకు భారీ ఊరట లభించినట్లయింది (Gold Silver Price Live).
గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,570 తగ్గి రూ.1,30,690కు చేరింది (Gold Rate Today). అలాగే ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,350 తగ్గి రూ.1,19,800 వద్దకు దిగివచ్చింది. బంగారంతో పాటు వెండి ధర కూడా భారీగా తగ్గింది. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.1.80 లక్షలకు చేరింది. గమనిక: బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలుదారులు మరోసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

బుల్ జోరు..

మార్కెట్ లో బుల్ జోరు చూపించింది. సెన్సెక్స్ దాదాపు 990 పాయింట్లు పెరిగి 83,021 వద్ద ముగిసింది. నిఫ్టీ 25,500 మార్కు దాటి స్థిరపడింది. నేటి మార్కెట్లో ఆటో, ఎఫ్ ఎంసీజీ షేర్లు ఆధిపత్యం ప్రదర్శించాయి.

10 నెలల గరిష్ఠానికి స్టాక్ మార్కెట్లు



ఆటో రంగం దూకుడు: పండుగ సీజన్ తర్వాత కూడా వాహనాలకు డిమాండ్ స్థిరంగా కొనసాగుతుండటం, ముడిసరుకు ధరలు తగ్గడంతో నిఫ్టీ ఆటో ఇండెక్స్ 3.3% పైగా ఎగబాకింది. మారుతి సుజుకి, ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీగా లాభపడ్డాయి.
విదేశీ పెట్టుబడుల ప్రవాహం (FPI Inflows): గత కొంతకాలంగా అమ్మకాలకు పాల్పడిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (FPIs) మళ్లీ దేశీయ మార్కెట్లలోకి భారీగా నిధులను కుమ్మరిస్తున్నారు. నవంబర్ నెలలో ఇప్పటివరకు దాదాపు రూ. 89,856 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది.
తగ్గిన ముడిచమురు ధరలు: అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం భారత్ వంటి దిగుమతి ఆధారిత దేశానికి పెద్ద ఊరటనిచ్చింది. ఇది రూపాయి విలువ బలపడటానికి, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గడానికి దోహదపడుతోంది.
సానుకూల అంతర్జాతీయ సంకేతాలు: యూఎస్ ఫెడ్ మినిట్స్ కాస్త కఠినంగా ఉన్నప్పటికీ, అమెరికా టెక్ సూచీ నాస్‌డాక్ (Nasdaq) లాభాల్లో ముగియడం, చైనాలో జరుగుతున్న APEC సదస్సు నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొంది.

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం (నవంబర్ 19) భారీ లాభాలతో కదం తొక్కాయి. రోజంతా సానుకూల ధోరణిలో సాగిన సూచీలు, ట్రేడింగ్ ముగిసే సమయానికి సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ (FMCG) రంగాల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరగడంతో బీఎస్ఈ సెన్సెక్స్ దాదాపు వెయ్యి పాయింట్ల మేర ఎగబాకగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 25,500 మార్కును దాటి స్థిరపడింది. (Sensex Nifty today)
బీఎస్ఈ సెన్సెక్స్ (BSE Sensex): క్రితం ముగింపు 82,031.81తో పోలిస్తే ఈరోజు 82,074.16 వద్ద లాభాలతో ప్రారంభమైంది. ఆరంభంలో ఒక దశలో 81,698.63 కనిష్ఠ స్థాయికి చేరినప్పటికీ, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. ఇంట్రాడేలో 83,043.87 గరిష్ఠ స్థాయిని తాకి, చివరకు 989.94 పాయింట్లు (1.21%) లాభపడి 83,021.75 వద్ద స్థిరపడింది.
ఎన్ఎస్ఈ నిఫ్టీ (Nifty 50): నిన్నటి ముగింపు 25,227.95 కాగా, ఈరోజు 25,186.80 వద్ద స్వల్ప నష్టాలతో మొదలైంది. కనిష్ఠంగా 25,104.80 స్థాయిని తాకిన తర్వాత క్రమంగా పుంజుకుని, గరిష్ఠ స్థాయి 25,514.30 వద్ద (286.35 పాయింట్లు / 1.14శాతం లాభంతో) ముగిసింది.
ఉదయం సెషన్‌లో కాస్త ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, మధ్యాహ్నం తర్వాత మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు పెరిగింది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్ (Eicher Motors) షేర్లు ఏకంగా 5 శాతం మేర దూసుకెళ్లగా, హిందుస్థాన్ యూనిలీవర్ (HUL) 4 శాతం లాభపడి మార్కెట్ ర్యాలీకి ప్రధాన కారణమయ్యాయి.
ప్రపంచ మార్కెట్ల విషయానికి వస్తే, అమెరికా మార్కెట్లలో డౌ జోన్స్ (-1.11%), ఎస్ అండ్ పీ 500 (-0.23%) నష్టాల్లో ఉన్నప్పటికీ, నాస్‌డాక్ (+0.42%), రస్సెల్ 2000 (+0.46%) లాభాల్లో ఉండటం దేశీయ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు సానుకూలంగా మారింది.
దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ అద్భుతమైన పునరాగమనంతో 10 నెలల గరిష్ఠ స్థాయి వద్ద స్థిరపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ (US Fed) కఠిన వైఖరి సంకేతాలను సైతం పక్కనపెట్టి, ఆరంభ నష్టాల నుంచి కోలుకున్న సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. ఆటో, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లతో సెన్సెక్స్ దాదాపు 1,000 పాయింట్లు ఎగబాకగా, నిఫ్టీ 25,500 మార్కును దాటింది. బ్యాంక్ నిఫ్టీ (Bank Nifty) చరిత్రలో తొలిసారిగా 63,000 మార్కు పైన ముగిసి సరికొత్త రికార్డు సృష్టించింది. నేటి ట్రేడింగ్‌లో దాదాపు 2,274 షేర్లు లాభాల్లో ముగియగా, 1,922 షేర్లు నష్టపోయాయి (197 షేర్లలో ఎలాంటి మార్పు లేదు).
బ్యాంకింగ్ షేర్ల జోరు: బ్యాంకింగ్ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు (PSU Banks) మెరుగైన త్రైమాసిక ఫలితాలు, ఆకర్షణీయమైన వాల్యుయేషన్ల కారణంగా ర్యాలీకి నాయకత్వం వహించాయి. దీంతో బ్యాంక్ నిఫ్టీ తొలిసారిగా 63,000 మార్కు పైన ముగిసింది.

ఈపీఎఫ్‌వో కొత్త ప్రతిపాదన..!

ఉద్యోగుల భవిష్య నిధి (EPF) చందాదారులకు తీపి కబురు అందించే దిశగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO) కసరత్తు చేస్తోంది. ఉద్యోగ పదవీ విరమణ వేళ పీఎఫ్ (PF) ఖాతాలోని మొత్తం సొమ్మును ఒకేసారి తీసుకోకుండా, విడతలవారీగా ఉపసంహరించుకునే అవకాశం కల్పించాలని యోచిస్తోంది. ఇందుకోసం సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (SWP) తీసుకురావాలని భావిస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం పదవీ విరమణ చేసిన ఉద్యోగి నెలవారీగా, మూడు నెలలకోసారి, ఆరు నెలలకోసారి లేదా ఏడాదికోసారి పీఎఫ్ సొమ్మును తీసుకునే అవకాశం ఉంటుంది. ఇలా విడతలవారీగా డబ్బులు పొందుతున్న సమయంలో ఖాతాలో మిగిలిన మొత్తంపై సాధారణ ఈపీఎఫ్ వడ్డీ కొనసాగుతుంది.
ఈ ప్రతిపాదిత విధానంలో సభ్యులకు మరో వెసులుబాటు కూడా ఉంటుంది. నిర్ణీత వ్యవధిలో విడతలవారీగా డబ్బులు తీసుకుంటున్నప్పటికీ, మధ్యలో ఈ పథకం నుంచి వైదొలిగి ఖాతాలో మిగిలిన మొత్తాన్ని ఒకేసారి ఉపసంహరించుకోవచ్చు. ఒకవేళ సభ్యుడు ఎస్‌డబ్ల్యూపీ ద్వారా డబ్బులు పొందుతున్న సమయంలో మరణిస్తే, మిగిలిన మొత్తాన్ని జీవిత భాగస్వామి లేదా నామినీ పొందే అవకాశం కల్పించడాన్ని ఈపీఎఫ్‌వో పరిశీలిస్తోంది. ఈ విధానంలో మరో ముఖ్యమైన అంశం స్వచ్ఛంద అదనపు చందాలు. ఈపీఎఫ్‌వో నిర్దేశించే డిజిటల్ మార్గాల ద్వారా సభ్యులు తమ పీఎఫ్ ఖాతాల్లో నేరుగా అదనపు మొత్తాలను జమ చేసుకునే అవకాశం కల్పించాలని ఈపీఎఫ్‌వో భావిస్తోంది. ఈ చెల్లింపులకు యజమాని నుంచి సమాన మొత్తంలో కంట్రిబ్యూషన్ అవసరం ఉండదు. సభ్యులు తమ జీతం ద్వారా కాకుండా, నేరుగానూ పీఎఫ్ ఖాతాలో డబ్బులు జమ చేసుకోవచ్చు.
నవంబర్ 19న జరిగే ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో ఈ ప్రతిపాదనను చర్చించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దీనిని అమలు చేయడానికి సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లో మార్పులు చేయకుండానే ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్స్ స్కీమ్-2026కు సవరణలు చేస్తే సరిపోతుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ప్రస్తుతం 55 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసులో రిటైర్ అయ్యే సభ్యులు తమ ఈపీఎఫ్ పొదుపుల్లో 100 శాతం మొత్తాన్ని ఒకేసారి ఉపసంహరించుకోవచ్చు. 55 ఏళ్లలోపు రిటైర్ అయితే వెంటనే 75 శాతం వరకు తీసుకోవచ్చు. మిగిలిన 25 శాతాన్ని 12 నెలల తర్వాత తుది సెటిల్‌మెంట్ రూపంలో పొందవచ్చు. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే రిటైర్మెంట్ తర్వాతా సభ్యులు తమ పీఎఫ్ నిధులను ఈపీఎఫ్ వ్యవస్థలో కొనసాగించవచ్చు. అవసరానికి అనుగుణంగా విడతలవారీగా డబ్బులు పొందవచ్చు.

EMPLOYEES' PROVIDENT FUND ORGANISATION
कर्मचारी भविष्य निधि संगठन
INDIA भारत
EPFO

కనుమరుగు అవుతున్న కట్టడాలు

- తెరమరుగు అవుతున్న చారిత్రక నిర్మాణాలు...
- రక్షణపై శ్రద్ధ లేని ప్రభుత్వాలు
- నవంబర్ 19...ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినం

ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినోత్సవం ప్రతి ఏట నవంబర్ 19న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారంగా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ -ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ', 'రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి.

అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకుల లో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంత వరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూల పురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీముఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది.

శాతవాహన చక్రవర్తుల చిత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్తూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని



కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలో మీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చబడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్దికి చెందిన హుస్సే నియా వాగు – చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్తూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యథార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరోవైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తల దించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...
9440595494





ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలు

ఆర్మూర్, నవంబర్ 19 (సింగిడి):
బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన ఏర్గట్ల గ్రామంలో గురువారం రోజున స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను ఏర్గట్ల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యర్యంలో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ సమక్షంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కాంగ్రెస్ తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్ మాట్లాడుతూ, దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి అన్ని రంగాలలో అన్ని వర్గాల ప్రజలు రాణించే విధంగా కృషిచేసిన ఏకైక నేత ఇందిరా గాంధీ అని వారన్నారు. ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల తో పాటు, దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన నాయకురాలని వారు కొనియాడారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివనోళ్ల శివకుమార్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవారెడ్డి, నర్సారెడ్డి, జీవన్ రెడ్డి, సర్పంచ్ సంజీవ్ యాదవ్, షేక్ జాకీర్, బద్దం లింగారెడ్డి, ముసుకు మోహన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయరెడ్డి, భూక్య నందు, ఎస్కే రషీద్, ఓర్స్ రాములు, ప్రభాకర్, సాయి ఇబ్రపట్నం నరసయ్య,రేండ్ల రాయ రెడ్డి, అనిల్ యాదవ్, మహబూబ్,తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజావాణి

ఖమ్మం, నవంబర్ 19(సింగిడి):
ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యర్యంలో జరిగినది. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యల దరఖాస్తులను స్వీకరించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గారు,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ , జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు కొట్టే రాజశేఖర్ ఎం ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ , జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్ ,మురళి , శ్రీరామ్ ,వెంకటేష్ నాయకులు పాల్గొని ఫిర్యాదీ దారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

రామాంజనేయకాలనీలో పోలీసుల తనిఖీలు

100 ఇళ్లలో సోదాలు.. 120 మద్యం బాటిళ్లు స్వాధీనం
డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రజలకు డీఎస్పీ అవగాహన

చుంచుపల్లి, నవంబర్ 19(సింగిడి):
కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజల భద్రతకు భరోసా కల్పించే లక్ష్యంతో పోలీసులు రామాంజనేయ కాలనీలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున సుమారు 80 మంది పోలీసు సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీలోని దాదాపు 100 ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు 54 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను పరిశీలించారు. తనిఖీల్లో సుమారు 120 ఐఎంఎఫ్ఎల్ మద్యం బాటిళ్లు గుర్తించి నాలుగు కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 45 జరిమానాలు విధించారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
తనిఖీల అనంతరం కాలనీవాసులతో మాట్లాడిన డీఎస్పీ ఆదినారాయణ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మూఢనమ్మకాలు, రహదారి భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని లింకులను తెరవకూడదని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.
ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.ప్రజల సహకారంతోనే శాంతిభద్రతలను మరింత సమర్థంగా కాపాడగలమని, నేరాల నియంత్రణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.డీఎస్పీ ఆదినారాయణ వెంట సబ్ డివిజన్ సీఐలు శ్రీలక్ష్మి , వెంకటేశ్వర్లు, యాసీన్, జితేందర్, ఇంద్రసేనారెడ్డి తదితరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దళితుడి భూమిపై నేతల అనుచరుడి కన్ను!

అప్పు పేరుతో పట్టా భూమి కబ్జా చేశారంటూ ఆరోపణలు..
ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అనుచరులపై శివ శంకర్ ధ్వజం
భూమిని తిరిగి బాధిత కుటుంబానికి అప్పగించాలి..

తెలకపల్లి నవంబర్ 19 (సింగిడి):
దళితులంటే చిన్నచూపుతోనే వారి భూములను అన్యాయంగా స్వాధీనం చేసుకుంటున్నారని, అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతో దళిత కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని తెలకపల్లి బీఆర్ఎస్వీ నాయకుడు రెడ్డపాకుల శివ శంకర్ ఆరోపించారు. తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన దళిత కుటుంబం వడ్డేమాన్ కృష్ణయ్యకు జరిగిన భూ వివాదంపై ఆయన తీవ్రంగా స్పందించారు.
గ్రామానికి చెందిన వడ్డేమాన్ కృష్ణయ్యకు సర్వే నంబర్ 332లో ఉన్న 1.27 గుంటల పట్టా భూమిని అప్పు పేరుతో మాయమాటలు చెప్పి వంజ నారాయణరెడ్డి అన్యాయంగా తన స్వాధీనంలోకి తీసుకున్నారని శివశంకర్ ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి అండదండలతోనే ఈ వ్యవహారం సాగిందని విమర్శించారు.



వంజ నారాయణరెడ్డి వద్ద పాలేరుగా పనిచేస్తున్న కృష్ణయ్య నిరక్షరాస్యుడని, ప్రధాన రహదారి పక్కనే ఉన్న విలువైన భూమిపై కన్నేసిన నారాయణరెడ్డి అప్పు పేరుతో పత్రాలపై సంతకాలు తీసుకుని భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై బాధిత కుటుంబం పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
అంతేకాకుండా, ఇటీవల తన పేరుపై ఉన్న భూమిని మరో వ్యక్తి పేరుపైకి మార్చినట్లు బాధిత కుటుంబం ఆరోపిస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, భూ రికార్డులను పరిశీలించి బాధిత దళిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ

నాగర్ కర్నూల్ నవంబర్ 19 (సింగిడి):
బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో హజ్రత్ మహమ్మద్ ఖాజా రుస్తుం అలీ షా చిష్తీ మిర్జాయా వ ఖలందరీ అమీరీ రహ్మతుల్లాహి అలైహి వారి 8వ వార్షిక ఉర్స్ షరీఫ్‌ను పురస్కరించుకొని నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల పోస్టర్‌ను గురువారం దర్గా ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖలీఫా, సజ్జాదా నషీన్ హజ్రత్ మహమ్మద్ ఖాజా అమీర్ అలీ చిష్తీ మిర్జాయా ఖలందరీ మాట్లాడుతూ.. పీర్-ఓ-ముర్షీద్ వారి ఆధ్యాత్మిక సేవలను స్మరించుకుంటూ, వారి పవిత్ర సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఉర్స్ షరీఫ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ ఆదివారం రాత్రి 11 గంటలకు సందల్ షరీఫ్, 30వ తేదీన మగ్రిబ్ నమాజ్ అనంతరం చిరాగాన్-ఎ-ఫైజ్, డిసెంబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు ఖత్మల్ ఖుర్‌ఆన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉర్స్ షరీఫ్ అనేది కేవలం వార్షిక వేడుక మాత్రమే కాదని, ఆధ్యాత్మిక గురువులను స్మరించుకుంటూ వారి బోధనలు, సేవలను గుర్తుచేసుకునే పవిత్ర సందర్భమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రులు కావాలని దర్గా ముతవల్లి కోరారు. ఉర్స్ షరీఫ్ కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 8074737666, 8186867386 ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా సాధికారతకు పెద్దపీట



నాగర్ కర్నూల్ రూరల్ నవంబర్ 19 (సింగిడి) :
మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. ఈ రోజు నాగర్ కర్నూల్ మండలం నర్సయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఐక్యతకు ఆర్థిక స్వావలంబనకు స్వయం ఉపాధి అవకాశాల అభివృద్ధికి కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ అభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు గ్రామీణ మహిళల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు మండల నాయకులు కోటయ్య గ్రామ సర్పంచ్ నల్లగంటి రాము ఉప సర్పంచ్ కేశ రేణుక గ్రామ అధ్యక్షులు బంగారయ్య గ్రామ ప్రజలు కాంగ్రెస్ నాయకులు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై కమిషనర్ నీ మర్యాద పూర్వకంగా కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్

కల్వకుర్తి నవంబర్ 19 (సింగిడి):
తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ వై. నాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులతో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా అభినందనలు తెలియజేశారు. ఈ భేటీ సందర్భంగా ఇరువురు అధికారులు పరస్పరం మర్యాద పూర్వకంగా పలకరించుకున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ, ఆహార భద్రత, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందాల్సిన ప్రయోజనాలు వంటి అంశాల్లో సంబంధిత శాఖల సమన్వయం ప్రాధాన్యతను ఈ సందర్భంగా ప్రస్తావించారు.ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడం, ఆహార భద్రతా చట్టం అమలును పటిష్టంగా కొనసాగించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడటంలో ఫుడ్ కమిషన్, పౌరసరఫరాల శాఖల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ల పనితీరుపై ఎస్పీ ఆకస్మిక తనిఖీ



కల్వకుర్తి నవంబర్ 19 (సింగిడి):
నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖ పనితీరును మరింత మెరుగుపరచడం, ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ (ఐపీఎస్) కల్వకుర్తి పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంతో పాటు ఊర్కొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నిర్వహించిన ఈ పర్యటనలో పోలీస్ స్టేషన్ల నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. డయల్ 112 ద్వారా అందే అత్యవసర ఫిర్యాదులపై ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించాలని, బాధితులకు సకాలంలో పోలీస్ సహాయం అందించాలని బ్లూకోట్ సిబ్బందికి స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, సైబర్ క్రైమ్ వారియర్, సీసీటీవీ విభాగం బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఎస్పీ సమీక్షించారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించి, వాటి దర్యాప్తును వేగవంతం చేసి చట్టపరమైన ప్రక్రియలకు అనుగుణంగా సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో కల్వకుర్తి డీఎస్పీ సాయి వెంకట్ రెడ్డి, కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్, ఊర్కొండ ఎస్సై రమాదేవితో పాటు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

2029లోనూ ప్రజాపాలనే లక్ష్యం!

- మరోసారి ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తాం
- సిద్దిపేట అభివృద్ధికి రూ.544.11 కోట్ల పనులకు శ్రీకారం
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా..
- మల్లన్నసాగర్ నిర్వాసితులకు పరిహారం, ఇళ్లు
- వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట కాంగ్రెస్ ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మంత్రి పదవి ఇస్తా: సీఎం రేవంత్‌రెడ్డి



సిద్దిపేట ప్రతినిధి, నవంబరు 19, (సింగిడి):
రాష్ట్రంలో 2029లో మరోసారి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చి రెండోసారి ప్రజాపాలన జెండా ఎగురవేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహిళల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి కల్పనే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి రూ.544.11 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు.సిద్దిపేట వైద్య కళాశాలకు మదన్‌మోహన్‌రావు పేరుతెలంగాణ తొలి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మదన్‌మోహన్‌రావు సేవలను గుర్తిస్తూ సిద్దిపేట వైద్య కళాశాలకు సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే మదన్మోహనారావు పేరు పెట్టాలని సీఎం నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను 24 గంటల్లో జారీ చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రిని ఆదేశించారు. సిద్దిపేట నుంచి గెలిచిన ఎమ్మెల్యేకు రాబోయే ప్రభుత్వంలో మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. మల్లన్నసాగర్ నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు.రూ.544.11 కోట్లతో అభివృద్ధి పనులుసిద్దిపేట దుబ్బాక నియోజకవర్గల వర్గాల పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఆరు మండలాల్లో తాసిల్దార్ కార్యాలయాలు చిన్నకోడూరు, దౌల్తాబాద్, లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణం మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు 451.13 కోట్లతో ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా 54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ సబ్‌స్టేషన్లు కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో 50 కోట్లతో నిర్మించిన 53 గ్రామ సంఘాల భవనాలు రాయపోల్‌లో 3.87 కోట్లతో నిర్మించిన నూతన కేజీబీవీ భవనం గజ్వేల్ లో 1.59 కోట్లలో నిర్మించిన విద్యుత్ డివిజన్ కార్యాలయ భవనం మరియు తదితర పనులను మొత్తం 92.95 కోట్లతో ముఖ్యమంత్రి ప్రారంభించారు.

అంబులెన్స్ డ్రైవర్ల నిర్వాకం

- పట్టపగలే బెల్టుషాపుల్లో మద్యం తాగిన వైనం..
- ప్రజల ఆరోగ్యసేవల నిర్వహణపై అనేక ప్రశ్నలు..
- డ్రైవర్ల తీరుపై మండిపడుతున్న స్థానికులు..





చుంచుపల్లి, నవంబర్ 19 (సింగిడి):
ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన అంబులెన్స్ డ్రైవర్లే బాధ్యతను విస్మరించి మద్యం సేవనానికి దిగితే ప్రజారోగ్య సేవల పరిస్థితి ఏమిటి? అత్యవసర సమయాల్లో క్షణం ఆలస్యమైనా ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉన్న నేపథ్యంలో, విధి నిర్వహణలో ఉండాల్సిన ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్లు పట్ట పగలే మద్యం సేవించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆపదలో ఉన్నవారిని ఆసుపత్రులకు చేర్చాల్సిన అంబులెన్స్‌ను పక్కన నిలిపి మద్యం సేవించిన తీరు స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది.
కొత్తగూడెం పట్టణ పరిధిలోని విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ అంబులెన్స్‌ను రహదారి పక్కన నిలిపిన డ్రైవర్లు సమీపంలోని బెల్టుషాపు వద్దకు వెళ్లి మద్యం సేవించారు. మధ్యాహ్నం పట్టపగలే చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వెలుగులోకి రావడంతో అంబులెన్స్ సిబ్బంది వ్యవహారశైలి బహిర్గతమైంది. అత్యవసర వైద్య సేవల కోసం కేటాయించిన వాహనాన్ని పక్కన పెట్టి మద్యం సేవించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ప్రాణాలు కాపాడాల్సిన విధుల్లో ఉండి..
అంబులెన్స్ సేవలు అనేవి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందే ప్రాణాధారమైన సేవలు. ప్రమాదాలు, గుండెపోటు, ఇతర అనారోగ్య సమస్యలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని సకాలంలో ఆసుపత్రులకు చేర్చాల్సిన బాధ్యత అంబులెన్స్ సిబ్బందిపై ఉంటుంది. అలాంటి కీలకమైన విధుల్లో ఉన్న డ్రైవర్లు మద్యం సేవించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్యగా కనిపిస్తోంది. మద్యం సేవించిన అనంతరం స్టీరింగ్ పట్టుకుంటే రోగుల ప్రాణాలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల భద్రత కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.
అధికారుల పర్యవేక్షణ ఏది?
ప్రభుత్వ అంబులెన్సుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. విధి నిర్వహణ సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం పర్యవేక్షణ వ్యవస్థ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అత్యవసర వైద్య సేవల్లో ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పుస్తక పఠనాన్నీ అలవర్చుకోవాలి

జిల్లా కలెక్టర్ కుమ్మ గుప్తా



మహబూబ్ నగర్ బ్యూరో , నవంబర్ 19(సింగిడి):
విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర మంచి పుస్తకాలను కూడా చదివే అలవాటు పెంపొందించుకోవాలని, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని జిల్లా కలెక్టర్ ఖుమ్మ గుప్తా అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డితో కలిసి సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి పూజించారు.
అనంతరం అక్కడ హాజరైన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఏడాది జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ఇతివృత్తం 'ఫైండ్ యువర్ జాయ్' అని, పుస్తక పఠనం ద్వారా మనకు ఆనందాన్ని, స్ఫూర్తిని ఇచ్చే అంశాలను అన్వేషించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు పాఠశాలల్లో చదివే పాఠ్య పుస్తకాలతో పాటు అదనంగా ఏమైనా పుస్తకాలు చదువుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోజూ కనీసం 10 నుంచి 20 పేజీలైనా ఇతర పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని కోరారు.
ఒక మంచి పుస్తకాన్ని రచించడానికి రచయితలు ఎన్నో సంవత్సరాల సమయాన్ని వెచ్చిస్తారని, తమ జీవిత అనుభవాలు, దశాబ్దాలుగా సంపాదించిన జ్ఞానాన్ని పుస్తకాల రూపంలో అందిస్తారని వివరించారు. విద్యార్థులు తమ జీవితంలో ప్రత్యక్షంగా అనుభవించడానికి ఎన్నో సంవత్సరాలు పట్టే విషయాలను ఒక పుస్తకం చదవడం ద్వారా తక్కువ సమయంలోనే తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల పుస్తకాలు మనకు జ్ఞానాన్ని అందించడంతో పాటు జీవితాన్ని సరైన దిశలో నడిపించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కథలు, నవలలు, జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, విజ్ఞాన సంబంధిత పుస్తకాలు చదవాలని సూచించారు. తాను ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలో శివ్ ఖేరా రచించిన 'యు కెన్ విన్' పుస్తకం చదివానని, అందులోని విషయాలు తనపై ఎంతో ప్రభావం చూపాయని కలెక్టర్ తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం, ఇతరులకు సహాయం చేసే గుణం వంటి అంశాలను పుస్తకాల ద్వారా నేర్చుకోవచ్చన్నారు. నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ఆమె జీవిత చరిత్రను చదవాలని సూచించారు. ప్రముఖ వ్యక్తుల జీవిత చరిత్రలు చదవడం ద్వారా వారి అనుభవాలు, ఆలోచనలు, సాధించిన విజయాల నుంచి స్ఫూర్తి పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్యదర్శి, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.

రూ.2 లక్షల ఎల్.ఓ. సి. అందజేసిన ఎమ్మెల్యే

ఆర్మూర్, నవంబర్ 19 (సింగిడి):
వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిజామాబాద్ జిల్లా, మెండోరా మండలం, పోచంపాడ్ గ్రామానికి చెందిన రఘుపతి వినోద్ వైద్య చికిత్స నిమిత్తం, బాధిత కుటుంబానికి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రూ.2 లక్షల ఎల్.ఓ.సి.(లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరు చేసిన ఎల్ ఓ సి పత్రాల కాపీని గురువారం రోజున హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుడు రఘుపతి వినోద్‌కు, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్ ఓ సి,మంజూరు చేయించి, బాధిత కుటుంబానికి అండగా నిలిచిన నేపథ్యంలో, బాధిత కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

బోధన్ ప్రతినిధి, నవంబర్ 19:(సింగిడి):
బోధన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వీక్లీ మార్కెట్లో గల ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళ ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమనిఅన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ గంగా శంకర్, బోధన్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంకుదామోదర్, నాయకులు ఎల్లం, పోతారెడ్డి, తలారి నవీన్, జహీర్, చిరంజీవి, గమరపేట శీను, వహీద్, డబ్బు, రవి గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవిత బీమా మోడల్ గ్రామంగా పడకల్ ఎంపిక

కల్వకుర్తి నవంబర్ 19 (సింగిడి):
తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామాన్ని ప్రభుత్వం ఇందిరమ్మ జీవిత బీమా మోడల్ గ్రామంగా ఎంపిక చేయడం పట్ల గ్రామ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,పడకల్ గ్రామాన్ని ఇందిరమ్మ జీవిత బీమా మోడల్ గ్రామంగా ఎంపిక చేయడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ఎంతో ప్రాధాన్యత కలిగిందన్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గ్రామ ప్రజలందరి తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల ఆందోళన

ఖమ్మం ప్రతినిధి నవంబర్ 19:(సింగిడి):
ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు ఇంటి జాగా రాకుండా చేస్తారా? మా భూమి మాకు ఇవ్వండి. గత ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదం పొంది ఖమ్మం జర్నలిస్టులకు 23.2 ఎకరాల భూమిని కేటాయించింది. వాటిని జర్నలిస్టులకు పంచకుండా మూడేళ్ల పాటు కాలయాపన చేయటం ఏమిటని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ప్రభుత్వాన్ని నిలదీశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం టియుడబ్ల్యూ జె (టిజెఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జడ్పీ సెంటర్ లోనే అంబేద్కర్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూ జె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ..జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని అమలు చేయమని అనేక రూపాలలో విజ్ఞప్తులు చేశాము. కానీ పాలకులు మారిన ప్రభుత్వాలు మారిన జర్నలిస్టుల బతుకులు మాత్రం మారటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఖమ్మం పర్యటనకు వచ్చే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నపోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, గట్టికొప్పుల ప్రశాంత్ రెడ్డి , ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, బిగ్ టీవీ భాస్కర్, ఆర్ టి వి ఉదయ్ ,మందటి వెంకటరమణ, వనం నాగయ్య, కలువకోలను హరీష్ రావు, శ్రీధర్ శర్మ, రాజ్ న్యూస్ ఉపేందర్, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు యలమందల జగదీష్, అశోక్ , కళ్యాణ్ , సాయి,నగర కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, జర్నలిస్టు నేతలు జీవన్ రెడ్డి, కె.వి, మోహన్, ముత్యాల కోటేశ్వరరావు, పానకాల రావు, మీడియా ఇన్చార్జ్ తిరుపతి రావు,వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, శేఖర్, నాగేశ్వరరావు, సుధాకర్,బాబు, ఫోటోగ్రాఫర్లు రాజు, మహేష్ , రవి, యూనియన్ నేతలు , తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో యువత భాగస్వాములు కావాలి





గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
హైదరాబాద్, నవంబర్ 19(సింగిడి):
అంతర్జాతీయ వ్యవహారాలు, దౌత్య సంబంధాలు, ప్రజాస్వామ్య విలువలపై యువతకు అవగాహన కల్పిస్తూ వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యూనైట్ నేషన్స్ (IIMUN) వంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం, దృఢ సంకల్పం ద్వారానే నిజమైన నాయకత్వం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ కుంట్లూర్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించిన 'ఐఐఎంయూఎన్ హైదరాబాద్ చాప్టర్–2026' కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆయన యువ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రస్తుతం ప్రపంచం వాతావరణ మార్పులు, వేగవంతమైన సాంకేతిక పరిణామాలు, అంతర్జాతీయ శాంతి వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని గవర్నర్ అన్నారు. 'వసుధైవ కుటుంబకం' అనే భారతీయ తాత్విక భావనతో ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తున్న భారతదేశంలో, ఇలాంటి సమస్యల పరిష్కారంలో యువత చురుకైన, సృజనాత్మక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఎంయూఎన్ వేదికపై జరిగే చర్చలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, తార్కిక ఆలోచన, పరస్పర సమన్వయం, బృంద స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య మర్యాదలను పాటించడం పరిణతి చెందిన పౌరసమాజానికి నిదర్శనమని పేర్కొన్నారు.సంప్రదాయంతో పాటు ఆధునిక ప్రగతిలో తెలంగాణ ముందంజ:చారిత్రక వారసత్వం, ఆధునిక ప్రగతికి తెలంగాణ ప్రతీకగా నిలుస్తోందని గవర్నర్ కొనియాడారు. కాకతీయుల శిల్పకళా వైభవం, ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, చారిత్రక చార్మినార్ రాష్ట్ర సాంస్కృతిక గౌరవానికి ప్రతీకలని అన్నారు. అదే సమయంలో సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు పొందుతోందని తెలిపారు. సంప్రదాయాలకు అనుసంధానమై ఉంటూనే ఆధునిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువతకు పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి:తన ప్రజా జీవిత ప్రయాణం విద్యార్థి దశలోనే ఏబీవీపీ (ABVP) ద్వారా ప్రారంభమైందని గుర్తుచేసుకున్న గవర్నర్, నాటి అత్యవసర పరిస్థితి (Emergency) సమయంలో జైలు జీవితం గడిపిన అనుభవం తనకు ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతను నేర్పిందని చెప్పారు. యువత నిషేధిత మాదకద్రవ్యాలు, ఇతర దురలవాట్లకు దూరంగా ఉంటూ తమ శక్తి, ప్రతిభను సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని హితవు పలికారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని (వికసిత్ భారత్) నిర్మించాలనే లక్ష్యం యువత భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని నూతన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు.ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించిన ఐఐఎంయూఎన్ బృందం, జాన్సన్ గ్రామర్ స్కూల్ యాజమాన్యాన్ని గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కె.ఆర్. సురేష్ రెడ్డి, కజకిస్తాన్‌లో భారత మాజీ రాయబారి టి.వి. నాగేంద్ర ప్రసాద్, ఐఐఎంయూఎన్ ఇన్‌చార్జి అధికారి ధ్రువ్ అగర్వాల్, జాన్సన్ గ్రామర్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ బి. మల్లిఖార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే ప్రక్రియపై అవగాహన కార్యక్రమం

మహబూబ్ నగర్ బ్యూరో , నవంబర్ 19(సింగిడి):
మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం శంకరాయపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు రైతులు, పట్టాదారులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ సూచించారు. గురువారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆమె భూ రీసర్వే విధానం, లక్ష్యాలు, ప్రయోజనాలపై రైతులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జీపీఎస్ ఆధారిత రోవర్ పరికరాల సహాయంతో నిర్వహిస్తున్న భూ రీసర్వే ద్వారా భూముల ఖచ్చితమైన కొలతలు చేపట్టడంతో పాటు భూ రికార్డులను నవీకరించేందుకు, భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా భూ సరిహద్దులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడంతో పాటు భూయజమానుల హక్కులను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. రీసర్వే నిర్వహించే నిర్దిష్ట తేదీన రైతులు, పట్టాదారులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి, తాజా భూ రికార్డులను సర్వే బృందాలకు అందించాలని కోరారు. సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం కొలతలు చేపట్టిన భూముల విస్తీర్ణ వివరాలను సంబంధిత పట్టాదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, గ్రామంలో నివసించని ఇతర గ్రామాలు, పట్టణాల్లో ఉంటున్న పట్టాదారులకు వారి భూముల సర్వే నిర్వహించే తేదీని ముందుగానే తెలియజేయాలని సూచించారు. వారు కూడా నిర్ణీత తేదీన తమ భూముల వద్ద హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగరావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌కు 'సురక్షిత్ జిల్లా' గుర్తింపు

మహబూబ్ నగర్ బ్యూరో , నవంబర్ 19(సింగిడి):
జిల్లాలో హెచ్ఐవీ , ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో నిర్దేశిత లక్ష్యాల సాధనకు చేసిన కృషితో మహబూబ్‌నగర్ జిల్లాకు 'సురక్షిత్ జిల్లా'గా గుర్తింపు లభించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఖుమ్మ గుప్తా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన 20 సురక్షిత్ జిల్లాల్లో మహబూబ్‌నగర్‌కు స్థానం దక్కడం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీసాక్స్) ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విద్యాసాగర్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'సమ్మన్ సమారోహ్' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

పేద విద్యార్థినికి అండగా

మున్సిపల్ చైర్ పర్సన్



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 19(సింగిడి): వికారాబాద్ పట్టణంలోని 25వ వార్డు సుభాష్ నగర్ ప్రాంతానికి చెందిన వెంకటేష్ యాదవ్ రేణుక దంపతుల కూతురు తేజస్వినిని బి.టెక్ విద్యార్థిని, ఆమె చదువు కోసం వికారాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గడ్డం అనన్య రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం వికారాబాద్ లో అందించారు. నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో కష్టకాలంలో ఆదుకుని, తమ కుమార్తె భవిష్యత్తుకు భరోసా ఇచ్చినందుకు తేజస్విని తల్లిదండ్రులు తెలంగాణ శాసనసభ స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ లకు , మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ తేజస్విని కష్టపడి చదువుకుని ఉన్నత స్థానంలో నిలవాలని, తల్లిదండ్రుల త్యాగాన్ని, నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. చదువుకునే పేద విద్యార్థులు ఆర్థిక కారణాలతో వెనుకబడకూడదన్నారు. వారికి సాయం చేయడం నా బాధ్యతగా భావిస్తానని, తేజస్విని లాంటి ఆడబిడ్డలు చదువులో రాణించి, ఉన్నత స్థాయికి ఎదగడమే నా లక్ష్యమని అన్నారు. డబ్బు లేక ఏ బిడ్డ చదువు ఆగకూడదని అందుకు వారికి ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని అన్నారు. ప్రజా ప్రభుత్వం పేద విద్యార్థులకు, ఆడబిడ్డల చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడటమే మా లక్ష్యని ఆమె తెలిపారు. విద్యతోనే కుటుంబాల్లో వెలుగు వస్తుందని తేజస్విని భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించి, తల్లిదండ్రులకు, వికారాబాద్ కు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. పదవి అంటే కేవలం హోదా కాదని, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడంలో భాస్వాములై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.





పేదల సొంతింటి కలను సాకారం చేయడమే

ప్రజా ప్రభుత్వ సంకల్పం

- స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 19(సింగిడి): పేదల సొంత ఇంటికలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. వికారాబాద్ నియోజకవర్గం మర్పల్లి మండలంలోని తిమ్మాపూర్, రావులపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు ఆయన హాజరయ్యారు. తిమ్మాపూర్ గ్రామంలో బేగరి భూపాల్ అంజలి దంపతులు, జోగు మహేందర్ – రేణమ్మ దంపతులు, జోగు శ్రీకాంత్ – లక్ష్మి దంపతులు, మామిడి శ్రీనివాస్ అనిత దంపతులు, తాండ్ర శ్రీశైలం లక్ష్మి దంపతులు, మోముల లావణ్య –రాజు దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు స్పీకర్ హాజరయ్యారు. రావులపల్లి గ్రామంలో ఆలూరి ప్రభావతి – అశోక్ దంపతులు, చింతకాయల సుమ వినోద్ కుమార్ దంపతుల, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవమని అన్నారు. భద్రత, భరోసా కల్పించే చిరునామాగా విరాజిల్లుతోందని అన్నారు. ప్రభుత్వం పేదల కష్టాలను అర్థం చేసుకుని, వారి సొంత గూడు కలను నిజం చేయాలనే లక్ష్యంతోనే ప్రజా ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. విడతలవారీగా ఆర్థిక సహాయం అందిస్తూ పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక అవరోధాలున్నా, పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించిందని అన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ లక్షలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తోందని తెలిపారు. పేదల కన్నీళ్లు తుడిచి, ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చి, ఆత్మగౌరవంతో కూడిన జీవనం అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యని, ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని, ప్రతి పేద కుటుంబానికీ అండగా ఉంటామని అన్నారు. పేదల సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయమని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ యు రవీందర్, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మర్పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్, తిమ్మాపూర్ సర్పంచ్ గాయత్రి గోవర్ధన్, మాజీ ఎంపీటీసీ సురేష్, పెద్దాపురం సర్పంచ్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్, యు. నగేష్, సురేష్, రావులపల్లి మాజీ సర్పంచ్ అబ్రహం, మాజీ సర్పంచ్ రాచన్న, గోపాల్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండ

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు సాగాలి

ఉమ్మడి రంగారెడ్డి 72,333 కొత్తపింఛన్లు

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, నవంబర్ 19 (సింగిడి): రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ అండగా నిలుస్తుందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వివాదాలు, విమర్శలకు తావు లేకుండా సాగాలని మహేందర్ రెడ్డి తెలిపారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి నియోజకవర్గంలో మహేందర్ రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, , డిప్యూటీ కమిషనర్ సఖియా సుల్తానా తదితరులతో కలిసి కొత్తగా మంజూ రైన 2,075 మంది లబ్ధిదారులకు వివిధ పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి లో 72,333 కొత్త పింఛన్లు కొత్తగా



ప్రభుత్వం మంజూరు చేసిందని మహేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో అల్వాల్ 821మందికి, మౌలాలిలో 1,0 48 మందికి, మల్కాజిగిరిలో 8,48 మందికి కొత్త పెన్షన్లు మంజూరైనాయని వివరించారు. మేడ్చల్ జిల్లాలో 25వేల 552 మందికి, రంగారెడ్డి జిల్లాలో 32, 065 మందికి, వికారాబాద్ జిల్లాలో 14,716 మందికి కొత్త చేయాత పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రతీ కుటుంబానికి ఎదో ఒక పథకం అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఇంకను పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు ,కొత్త రేషన్ కార్డులు మంజూరు కానీ వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అందరికీ అందుతాయని చెప్పారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలని, అందుకు రాజకీయాలకు అతీతంగా తాము నియోజకవర్గంలో సహకరిస్తామని చెప్పారు. వికలాంగులు, వృద్ధులు ఇంకను ఎంతో మందికి పెన్షన్లు అందడం లేదని తెలిపారు. జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందిస్తామని చెప్పారు.

13.54 మీటర్ల లోతుల్లోకి దిగజారిన భూగర్భ జలాలు

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 19(సింగిడి): వికారాబాద్ జిల్లా ప్రజలకు, రైతులకు, నీటి వినియోగదారులకు పారిశ్రామికవేత్తలకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఎల్ నినో ప్రభావంతో ఏర్పడనున్న స్థితి ని తెలియజేస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షాభావం కారణంగా తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత లోతైన భూగర్భ జల మట్టాలు వికారాబాద్ జిల్లాలో (భూమికి 13.54 మీటర్ల లోతులో) నమోదయ్యాయి. దీనివల్ల గృహ నీటి భద్రతకు వ్యవసాయ స్థిరత్వానికి ముప్పు ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. తెలంగాణ నీరు, భూమి మరియు చెట్ల చట్టం, 2002 (వాల్టా) ప్రకారం భూగర్భ జలాల అతి వినియోగాన్ని నియంత్రించేందుకు, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా కాపాడేందుకు తక్షణమే ఈ క్రింది ఆదేశాలు జారీ చేశారు. మీసేవ ద్వారా మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ గృహ అవసరాల కోసం కొత్త బోరుబావుల తవ్వకానికి అనుమతి కోరుతూ దరఖాస్తులను కేవలం మీసేవ పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాలి. ఆఫ్‌లైన్ లేదా నేరుగా కార్యాలయాల్లో ఇచ్చే దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడవని తెలిపారు. మీసేవ ద్వారా ముందస్తు ఆన్‌లైన్ సిస్టమ్ జనరేటెడ్



బోరుబావి తవ్వకం అనుమతి పత్రం లేకుండా బోరుబావులు తవ్వడాన్ని చాలా తీవ్రంగా పరిగణించబడుతుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారి బోరుబావులను తక్షణమే సీజ్ చేయడంతో పాటు, భారీ జరిమానాలు మరియు వాల్టా చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయి.

బోరు రిగ్గుల నియంత్రణ, రైతులపై ఆర్థిక భారం

పడకుండా భూగర్భ జల శాఖ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సిస్టమ్ జనరేటెడ్ మీసేవ బోరుబావి తవ్వకం అనుమతి పత్రం లేకుండా జిల్లాలో తిరిగే బోరు రిగ్గులను తక్షణమే సీజ్ చేసి, రిగ్గు యజమానులు భూ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయి. అశాస్త్రీయంగా బోర్లు వేయడం వల్ల నీరు రాక రైతులు నీటి వినియోగదారులు తీవ్ర ఆర్థిక భారంతో అప్పులపాలు కాకుండా ఉండేందుకు, సాంకేతిక అనుమతి, మీసేవ అనుమతి పత్రం లేకుండా ఎటువంటి తవ్వకాలు చేపట్టరాదు. పరిశ్రమలకు తప్పనిసరి ఆదేశాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలోని అన్ని పరిశ్రమలు తప్పనిసరిగా వ్యర్థ జలాల శుద్ధి, పునర్వినియోగం (జీరో లిక్విడ్ డిశ్చార్జ్) చేపట్టాలి. అలాగే తమ ప్రాంగణాల్లో కృత్రిమ భూగర్భ జల రీఛార్జ్ నిర్మాణాలు (ఇంకుడు గుంతలు) వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు) నిర్మించుకోవాలి. ఉల్లంఘించిన పరిశ్రమలపై జరిమానాలు, మూసివేత చర్యలు తీసుకోబడతాయి. యాసంగి (రబీ) పంట మార్పిడి, వరికి బదులుగా ఆరుతడి పంటలు, రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో అధిక నీటిని వినియోగించే వరి పంటకు సరిపడా భూగర్భ జలాలు అందుబాటులో లేనందున, రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలి. గృహ అవసరాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు పొంగిపొర్లకుండా చూడటం, లీకేజీలను అరికట్టడం మరియు వాహనాలు, వాకిళ్లు కడగడానికి తాగునీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని పొదుపు చేయాలి. తరిగిపోతున్న భూగర్భ జలాలను కాపాడుకోవడానికి జిల్లా యంత్రాంగానికి ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని కోరడమైనది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని

విజయవంతంగా అమలుచేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19 (సింగిడి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన కుటుంబాల వివరాలను నూతన విధివిధానాల ప్రకారం ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యలు, నమోదు ప్రక్రియపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నమోదు శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ నుంచి శిబిరాల ద్వారా బీమా వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. శిబిరాల నిర్వహణ, నమోదు ప్రక్రియపై ప్రజలకు ముందస్తు సమాచారం అందేలా టామ్‌టామ్‌తో పాటు ఇతర సమాచార మాధ్యమాల ద్వారా



తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని తెలిపారు. పథకం నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నందున అధికారులు, ఆపరేటర్లు పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు, నామినీల వివరాలు, వయస్సు, కుటుంబ సభ్యులతో ఉన్న బంధుత్వ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియ చేపట్టే ఆపరేటర్లకు ముందస్తు అవగాహన కల్పించాలని, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు శిబిరాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆహార భద్రత కార్డు కలిగిన అర్హుల వివరాలను మాత్రమే నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఆహార భద్రత కార్డు నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం బీమా చేయించుకున్న వ్యక్తి మొబైల్ ఫోన్‌కు సమాచారం అందుతుందని కలెక్టర్ తెలిపారు. నామినీ వివరాలు నమోదు చేయాల్సి ఉన్నందున బీమా చేయించుకునే వ్యక్తి స్వయంగా నమోదు శిబిరానికి హాజరై అవసరమైన వివరాలను అందించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే నామినీలు శిబిరానికి హాజరుకావాల్సిన అవసరం లేదని తెలిపారు. నమోదు చేసిన ప్రతి దరఖాస్తు వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలకు అనుగుణంగా రికార్డులను నిర్వహించి భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, డీపీఓ మల్లారెడ్డి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, సిపిఓ గీత, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈడీఎం ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కలిసిన మునిదేవునిపల్లి రైతులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

భూ రికార్డుల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19 (సింగిడి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన రైతులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కలిసి తమ భూ సమస్యలను వివరించి, పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 92కు సంబంధించిన భూముల విషయంలో భూ రికార్డుల్లో నెలకొన్న సమస్యలు, భూముల విస్తీర్ణంలో తేడాలు, పంట రుణాలు, చెల్లింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తమకు రెండు ఎకరాల భూమి ఉన్నప్పటికీ రికార్డుల్లో ఒక ఎకరం 20 గుంటలుగా చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను వెలికితీసి, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వారి సమస్యలను సానుకూలంగా విని, ప్రతి అంశాన్ని పరిశీలించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, రైతులకు తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి భూ రికార్డుల్లో ఉన్న సమస్యలు, భూముల విస్తీర్ణంలో తేడాలపై సమగ్ర విచారణ జరిపించి, న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పారదర్శకంగా విచారణ చేపట్టి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ... సేవలు త్యాగాలు దేశ చరిత్రలో మైలురాళ్లు

- పేద ప్రజల సంక్షేమానికి... మహిళా సాధికారికతకు ఇందిరా సేవలు అమోఘం
- జవహర్‌నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్

జవహర్ నగర్, నవంబర్ 19 (సింగిడి): పేద ప్రజల సంక్షేమానికి మహిళ సాధికారికతకు ఇందిరాగాంధీ చేసిన సేవలు అమోఘమని, ఇందిరాగాంధీ సేవలు త్యాగాలు దేశ చరిత్రలో మైలురాళ్లుగా నిలుస్తాయని జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ తెలిపారు. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ 3 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో దేశ తొలి మహిళ ప్రధాని ఉక్కుమహిళగా పేరుగాంచిన స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను జవహర్ నగర్ డివిజన్ 3 కాంగ్రెస్ పార్టీ



కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ హాజరై ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధికి పేద ప్రజల సంక్షేమానికి మహిళా సాధికారికతకు దేశ ఐక్యత సమగ్రత కోసం ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయమన్నారు. ఇందిరాగాంధీ దేశం కోసం చేసిన సేవలు తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు భారతదేశ చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ఆమె జీవితం ఒక గొప్ప స్ఫూర్తి అన్నారు . ఆమె చూపిన ధైర్యం సాహసం ఆత్మవిశ్వాసం ప్రజా సేవ ప్రపంచానికి స్ఫూర్తిదాయ కమని ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని ప్రపంచంలోని పలు దేశాన్ని నేతలు ఆమె చూపిన శాంతి మార్గంలో పయనించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, జిల్లా సెక్రటరీ కల్లేపల్లి సదానంద్, జిల్లా అధికార ప్రతినిధి అనంతలక్ష్మి, మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షులు మాట్ల వినయ్, ఓబిసి చైర్మన్ పసుపులేటి వీర భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, గజ్వేల్ శంకర్, కిరణ్, మాట్ల శ్రీను, సాయికిరణ్ సోమేశ్వర చారి వీర్ల భుజంగం రాజు యాదవ్ గండి సునీత చింత విజయ పుష్ప అజయ్ మధు గౌతమి శ్రీదేవి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నూతన పెన్షన్ల మంజూరీతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కుత్బుల్లాపూర్, నవంబర్ 19 (సింగిడి):



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సాయిబాబా నగర్ డివిజన్‌లో అర్హులైన వారికి నూతనంగా పెన్షన్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేయడంతో గురువారం సూరారం చివరి బస్ స్టాప్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన పేదలకు నూతన పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, శ్యామ్, సత్తిరెడ్డి, గణేష్, కుమారి, రేఖ, వరలక్ష్మి, శివ, సందీప్, సాయి, రిజ్వాన్ పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

చేనేత కళాకారుడి ఆవిష్కరణకు జాతీయ స్థాయి గుర్తింపు

పోచంపల్లి చీరల రూపకల్పనలో శ్రమను తగ్గించే యంత్రానికి 'ఐఎఫ్ఐఏ భారత్' అవార్డు

బెంగళూరు సాంకేతిక సదస్సులో గ్రామీణ ఆవిష్కరణ విభాగంలో ద్వితీయ బహుమతి



ఆలేరు, నవంబరు 19(సింగిడి): చేనేత రంగంలో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ పనులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ఆలేరుకు చెందిన చేనేత కళాకారుడు చింతకింది నరేందర్ రూపొందించిన ప్రత్యేక యంత్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పోచంపల్లి చీరల తయారీలో కీలకమైన దారాలపై నమూనాలు గీసే ప్రక్రియను సులభతరం చేసేందుకు ఆయన రూపొందించిన 'నమూనాల గుర్తింపు యంత్రం'కు బెంగళూరులో నిర్వహించిన అంతర్జాతీయ ఆవిష్కరణల పోటీలో గ్రామీణ ఆవిష్కరణల విభాగంలో ద్వితీయ బహుమతి లభించింది. ఈ పురస్కారాన్ని అందుకోవడంతో ఆలేరు ప్రాంతానికి, తెలంగాణ చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు లభించినట్లయింది. బెంగళూరులో నవంబరు 17 నుంచి 19 వరకు నిర్వహించిన బెంగళూరు సాంకేతిక సదస్సు–2026లో భాగంగా అంతర్జాతీయ ఆవిష్కరణలు, నూతన ఆలోచనల అనుసంధాన వేదిక ఆధ్వర్యంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా మొత్తం 146 ఆవిష్కరణలు పోటీపడగా, వాటిలో 30 ఆవిష్కరణలను తుది పరిశీలనకు ఎంపిక చేశారు. రెండు దశల్లో నిపుణుల బృందం పరిశీలన, మూల్యాంకనం చేపట్టిన అనంతరం మూడు పురస్కారాలను ప్రకటించారు. గ్రామీణ ఆవిష్కరణల విభాగంలో చింతకింది నరేందర్ రూపొందించిన యంత్రానికి రెండో బహుమతి దక్కింది.

చేనేతలోని కష్టమే ఆవిష్కరణకు ప్రేరణ

ఆలేరుకు చెందిన నరేందర్ చేనేత కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచి చేనేత వృత్తితో అనుబంధం ఉండటంతో ఆ రంగంలోని కష్టనష్టాలను దగ్గరగా చూశారు. ముఖ్యంగా పోచంపల్లి చీరల తయారీలో రంగులు అద్దడం, ఆసు పోయడం, దారాలపై నమూనాలు గీయడం, రబ్బరు చుట్టడం, తిరిగి రంగులు అద్దడం, చివరగా మగ్గంపై వస్త్రాన్ని నేయడం వంటి అనేక దశలు ఉంటాయి. వీటిలో దారాలపై నమూనాలు గీయడం అత్యంత శ్రమతో కూడుకున్న పని. దీనికి ఎంతో అనుభవం, ఓర్పు, ఏకాగ్రతతోపాటు మంచి కంటిచూపు అవసరం. ఈ ప్రక్రియలో ఎక్కువ సమయం వెచ్చించాల్సి రావడంతో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన నరేందర్, ఆ పనిని సులభతరం చేసే యంత్రాన్ని రూపొందించాలని సంకల్పించారు.

2013లో ప్రారంభమైన ప్రయత్నం

ఈ ఆలోచనకు 2013లో శ్రీకారం చుట్టారు. తొలుత ఒక యంత్ర నమూనాను తయారు చేసినప్పటికీ, అది అందరూ సులభంగా ఉపయోగించుకునే విధంగా లేదని గుర్తించారు. దీంతో మరిన్ని మార్పులు చేసి మెరుగైన యంత్రాన్ని రూపొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే గణనీయమైన మొత్తంలో డబ్బు ఖర్చు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. కొంతకాలం పనులను నిలిపివేయాల్సి వచ్చినా తన లక్ష్యాన్ని మాత్రం వదులుకోలేదు. సొంత స్థలం విక్రయించి **ఆవిష్కరణకు నిధులు** యంత్ర రూపకల్పనను పూర్తిచేయాలనే పట్టుదలతో 2018లో తన సొంత స్థలాన్ని విక్రయించారు. దాని ద్వారా వచ్చిన డబ్బుతో తిరిగి యంత్రం తయారీ పనులను ప్రారంభించారు. యంత్రానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా కంప్యూటరు కార్యక్రమాల రూపకల్పన విషయంలో సహాయం అవసరమైంది. ఆ సమయంలో పల్లె సృజన స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చి అవసరమైన సూచనలు, సలహాలు అందించింది. సంస్థ సహకారంతో నరేందర్ తన ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లారు. అనేక ప్రయోగాలు, సాంకేతిక మార్పులు, ఎదురుదెబ్బలను అధిగమిస్తూ 2023 నాటికి యంత్రాన్ని ఒక రూపంలో తయారు చేశారు. అయితే తయారీతోనే సరిపెట్టకుండా అందులో వినియోగించిన విడిభాగాల నాణ్యత, మన్నిక, దీర్ఘకాలిక పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ చూపారు.

ఆరు నెలలపాటు పనితీరు పరిశీలన

తయారైన యంత్రాన్ని ఇతరులకు వినియోగించేందుకు అందించి, వారి అనుభవాలు, సూచనలను సేకరించారు. వాటి ఆధారంగా అవసరమైన మార్పులు చేసి యంత్రాన్ని మరింత మెరుగుపరిచారు. అనంతరం మరో వ్యక్తికి అందించి సుమారు ఆరు నెలలపాటు దాని పనితీరును పరిశీలించారు. ఈ పరిశీలనలో మంచి స్పందన రావడంతో యంత్రం ఆశించిన విధంగా పనిచేస్తోందనే నమ్మకం కలిగింది. ఈ ఆవిష్కరణకు సంబంధించి పేటెంట్ నమోదు ప్రక్రియ కూడా పూర్తయింది.

బెంగళూరు వేదికగా ప్రతిభకు గుర్తింపు

తన ఆవిష్కరణను దేశవ్యాప్తంగా పరిచయం చేయాలనే ఉద్దేశంతో నరేందర్ బెంగళూరులోని అంతర్జాతీయ ప్రదర్శన కేంద్రంలో నిర్వహించిన బెంగళూరు సాంకేతిక సదస్సు–2026లో యంత్రాన్ని ప్రదర్శించారు. అదే వేదికపై నిర్వహించిన అంతర్జాతీయ ఆవిష్కరణలు, నూతన ఆలోచనల అనుసంధాన పురస్కారాల పోటీలో పాల్గొన్నారు. మొత్తం 146 ఆవిష్కరణలతో పోటీపడి, తుది దశకు ఎంపికైన 30 ఆవిష్కరణల్లో తన యంత్రానికి స్థానం దక్కించుకున్నారు. నిపుణుల పరిశీలన అనంతరం గ్రామీణ ఆవిష్కరణల విభాగంలో ద్వితీయ బహుమతిని అందుకున్నారు.

చేనేత కార్మికుల శ్రమ తగ్గించడమే లక్ష్యం

ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. తాను చేనేత కుటుంబానికి చెందినవాడినని, వృత్తిలోని సమస్యలను స్వయంగా అనుభవించానని తెలిపారు. ముఖ్యంగా దారాలపై నమూనాలు గీసే పనిలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించాలనే ఉద్దేశంతోనే ఈ యంత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్ల శ్రమ, ఆర్థిక ఇబ్బందులు, నిరంతర ప్రయత్నాల అనంతరం తన ఆవిష్కరణకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రయాణంలో సాంకేతిక సహకారం అందించి, అవసరమైన సూచనలు, సలహాలతో ప్రోత్సహించిన పల్లె సృజన స్వచ్ఛంద సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన లక్ష్యం కేవలం ఒక యంత్రాన్ని తయారు చేయడం మాత్రమే కాదని, చేనేత కార్మికుల శ్రమను తగ్గించి సంప్రదాయ వృత్తిలోని కష్టతరమైన పనులను సాంకేతిక పరిజ్ఞానంతో సులభతరం చేయడమేనని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ చేనేత రంగానికి ఉపయోగపడే మరిన్ని ఆవిష్కరణలు చేపట్టేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. 2013లో చిన్న ఆలోచనగా మొదలైన ప్రయత్నం.. ఆర్థిక ఇబ్బందులు, ఎన్నో సవాళ్లను అధిగమించి పేటెంట్ నమోదు, జాతీయ ప్రదర్శన, ప్రతిష్ఠాత్మక పురస్కారం వరకు చేరింది. వృత్తిలోని సమస్యకు అదే వృత్తికి చెందిన కళాకారుడు పరిష్కారం కనుగొని, దానిని ఆవిష్కరణగా మలచడం గ్రామీణ ప్రాంతాల్లోని ఔత్సాహిక ఆవిష్కర్తలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. చేనేత కళను సాంకేతికతతో అనుసంధానిస్తూ నరేందర్ సాగించిన ఈ ప్రయాణం ఆలేరు ప్రాంతానికి గర్వకారణంగా మారింది.

చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు ముందస్తు అరెస్ట్



చేర్యాల, నవంబర్ 19 (సింగిడి): చేర్యాల రెవిన్యూ డివిజన్ జేఏసీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ పాలన నిదర్శనం అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు ఈ ఉద్యమ ఆపాలంటే చేర్యాల రెవెన్యూ డివిజన్ ను ప్రకటించాలి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట మీద నిలబడాలి 2023 అసెంబ్లీ ఎలక్షన్లో భాగంగా జనగామ జిల్లాలో మీరు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తానని ప్రకటించారు ఇంతవరకు వాగ్దానాలకే పరిమితమైంది ఈ ప్రభుత్వం వచ్చిన నుండి ఈ పోరాటం గత పది సంవత్సరాల నుండి నడుస్తుంది సిద్దిపేట బహిరంగ సభలో భాగంగా మీరు ఇచ్చిన మాటమీద నిలబడి చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటించాలి డిమాండ్ చేస్తున్నాం లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేదాకా పోరాటం ఆగదని అరెస్టు చేసిన నాయకులు విడుదల చేయాలని కోరుచున్నాము.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్ల ధరల నిర్ణయంపై కలెక్టర్ సమావేశం



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 19(సింగిడి): ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే గుడ్ల ధరలపై నిర్ణయంపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం సమావేశం నిర్వహించారు. సంక్షేమ అధికారులతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్ల ధరలపై జిల్లా కలెక్టర్ టెండర్‌దారులతో సమావేశం నిర్వహించారు. గుడ్ల ప్రస్తుత మార్కెట్ ధరలు, కొనుగోలు ధరలు, రవాణా ఖర్చులు, సరఫరా వ్యయం తదితర అంశాలపై చర్చించారు. గుడ్ల ధరలను సమీక్షించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరైన ధర నిర్ణయించే అంశంపై కలెక్టర్ టెండర్‌దారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, చిన్నారులకు పోషకాహార పథకాల అమలులో ఎలాంటి అంతరాయం కలగకుండా నాణ్యమైన గుడ్లను నిర్ణీత సమయంలో సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. గుడ్ల ధరలను పారదర్శకంగా నిర్ణయించాలని, ప్రభుత్వానికి ఆర్థిక భారం పడకుండా చూడాలని, సరఫరాదారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. గుడ్ల ధరల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఏం జే ఆర్ పౌల్ట్రీ, గీత పౌల్ట్రీ ,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించిన దమ్మని శ్రావణ్ కుమార్



కుత్బుల్లాపూర్, నవంబర్ 19 (సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం. జీడిమెట్ల సర్కిల్ లోని 286కుత్బుల్లాపూర్ డివిజన్ జీడిమెట్ల మెయిన్ రోడ్డు చౌరస్తాలో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద భారత మాజీ ప్రధాని దివంగత నేత ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆ మహానేతకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దమ్మని శ్రావణ్ కుమార్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ భారత తొలి మహిళా ప్రధానమంత్రిగా ఉండి భారతదేశాన్ని ఎంతో అభివృద్ధి బాటలో నడిపించిన మహనీయురాలు ఆమె జయంతి వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి ఇందిరా జీవిత బీమా కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. మహిళలందరికీ ఇందిరా చీరలు పంపిణీ కార్యక్రమం, మహిళలకు వితంతువులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు కూడా పెన్షన్ ఇవ్వడం గురించి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. గత పది సంవత్సరాల నుండి టిఆర్ఎస్ ప్రభుత్వంలో బోసిపోయిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలన్నీ కూడా నేడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజలందరికీ కూడా మేలు కలిగించే విధంగా పాలన జరుగుతుందన్నారు. ప్రజలందరు గమనించాల్సిన సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 286 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిట్ల ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి, డివిజన్ ఎస్ ని సెల్ అధ్యక్షులు బి రంగయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత యాదవ్, డివిజన్ స్పోక్ సన్ గుమ్మడి మధుసూదన్ రాజు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కీర్తి రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు శ్యామల, రేష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21న సంగారెడ్డిలో జరిగే ఐలు ప్రథమ మహాసభలను జయప్రదం చేయండి

బార్ అసోసియేషన్ నాయకులు నాగ భాస్కర్, ఆర్.శ్రీనివాస్

అఖిల భారత న్యాయవాదుల సంఘం జిల్లా ప్రథమ మహాసభల కరపత్రం విడుదల



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19 (సింగిడి): నవంబర్ 19న సంగారెడ్డి పట్టణంలోనీ గిరిజన న్యాయ కళాశాలలో జరిగే అఖిల భారత న్యాయవాదుల సంఘం (అయిలు) జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని, బార్ అసోసియేషన్ నాయకులు రొయ్యపల్లి శ్రీనివాస్, కె.నాగ భాస్కర్, పిలుపునిచ్చారు. ఈరోజు సంగారెడ్డిలో జరుగు ఐలు ప్రథమ మహాసభ కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ నెల 21న మహాసభలను పురస్కరించుకుని లి"రాజ్యాంగం – న్యాయవాదుల ముఖ్య పాత్ర"లి అనే అంశంపై జిల్లా స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సెమినార్ కు ముఖ్య అతిథిగా గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శ్రీమతి టి. రజని, గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి భవానీ చంద్ర, అయిలు రాష్ట్ర కార్యదర్శి శ్రీ డి. పార్థసారథి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు శ్రీ మందడపు శ్రీనివాసరావు, అయిలు రాష్ట్ర మహిళా కన్వీనర్ మరియు బార్ కౌన్సిల్ సభ్యురాలు, శ్రీమతి ఎస్.శైలజ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, న్యాయవాదులు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ వెనీలా రెడ్డి, కె. సుభాష్ చంద్ర, టి.రత్నాకర్, ఇక్బాల్ పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 19(సింగిడి): 2026--27 కింద రూ 2. 20 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో 11 కస్టమ్ హైరింగ్ సెంటర్ల సీ హెచ్ సీ స్ మంజూరు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అద్దె ప్రాతిపదికన అందుబాటులోకి తీసుకురావడానికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 11 కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సబ్-మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ ఎస్ ఎం ఏ ఎం కింద అమలు చేయబడుతున్న ఈ కార్యక్రమానికి మొత్తం రూ 2.20 కోట్ల నిధులు మంజూరు చేయబడ్డాయి. అర్హత కలిగిన సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పీ ఏ సీ ఎస్, మహిళా స్వయం సహాయక సంఘాలు ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి, నిర్వహించడానికి అర్హులు. సబ్సిడీ విధానం ఈ విధంగా ఉంది. లబ్ధిదారులకు ప్రాజెక్ట్ వ్యయంలో 40 శాతం లేదా గరిష్టంగా రూ 20 లక్షల వరకు (ఏది తక్కువైతే అది) సబ్సిడీ లభిస్తుంది. కిసాన్ డ్రోన్ సీ హెచ్ సీ లు ప్రత్యేకంగా కిసాన్ డ్రోన్ల కోసం ఏర్పాటు చేసే కేంద్రాలకు, వ్యయంలో (డ్రోన్, ప్రాథమిక పరికరాలు మరియు అనుబంధ పరికరాలతో కలిపి) 50శాతం లేదా గరిష్టంగా రూ 5 లక్షల వరకు (ఏది తక్కువైతే అది) సబ్సిడీ అందించబడుతుంది. పంట కాలం మొత్తానికి అవసరమైన 37 ముఖ్యమైన వ్యవసాయ యంత్రాలు మరియు పరికరాలను వ్యవసాయ శాఖ గుర్తించింది. భూమి తయారీ ట్రాక్టర్, పవర్ టిల్లర్లు, డిస్క్ నాగళ్లు కల్టివేటర్లు, లెవెలింగ్ బ్లేడ్లు రోటవేటర్లు. విత్తడం, నాటడం, విత్తనాలు మరియు ఎరువులు వేసే యంత్రాలు, మల్టీ-క్రాప్ ప్లాంటర్లు మరియు రిడ్జ్ ఫర్రో ప్లాంటర్లు.

కలుపు తీత, పంట రక్షణ, పవర్ వీడర్లు, గడ్డి కత్తిరించే యంత్రాలు నాప్‌సాక్ స్ప్రేయర్లు, ట్రాక్టర్, మౌంటెడ్ బూమ్ స్ప్రేయర్లు మరియు కిసాన్ డ్రోన్లు. పంట కోత, కోత అనంతర పనులు: కంబైన్ హార్వెస్టర్లు, మొక్కజొన్న హార్వెస్టర్లు, మల్టీ-క్రాప్ థ్రెషర్లు మరియు తూర్పారబట్టే ఫ్యాన్లు, పంట వ్యర్థాల నిర్వహణ స్ట్రా బేలర్లు, రోటర్ స్లాషర్లు, మల్చర్లు బ్రష్ కట్టర్లు. దరఖాస్తు ఎంపిక ప్రక్రియ. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అ-ర్హత కలిగిన సంఘాలు కేంద్ర ప్రభుత్వ అగ్రికల్చరల్ మెకనైజేషన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించాలి. పారదర్శక తనిఖీ యంత్రాల ఎంపిక, డీలర్ల కేటాయింపు, బిల్లుల ధృవీకరణ మరియు భౌతిక తనిఖీలు అధికారిక మార్గదర్శకాల ప్రకారం కఠినంగా నిర్వహించబడతాయి. పరికరాల ధరలు రాష్ట్ర స్థాయిలో నిర్ణయించిన గరిష్ట పరిమితి ధరలను మించకూడదు. పర్యవేక్షణ కమిటీ క్షేత్రస్థాయిలో ఈ పథకం పారదర్శకంగా అమలయ్యేలా చూసేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా వ్యవసాయ అధికారి (డి ఏ వో) కన్వీనర్‌గా జిల్లా స్థాయి కమిటీ పర్యవేక్షిస్తుంది. అధికారుల, భాగస్వాముల వ్యాఖ్యలు డి ఏ వో వికారాబాద్ వ్యవసాయ యంత్రాలను వ్యక్తిగతంగా కొనుగోలు చేయడం రైతులకు పెను ఆర్థిక భారం. కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఉపయోగించుకోవడం ద్వారా, రైతులు నామమాత్రపు అద్దెకు సమయానికి పరికరాలను పొందవచ్చు. అదే సమయంలో ఎఫ్ఫ పీ వో, ఎఫ్ పీ వోలు, పీ ఏ సీ ఎస్, మహిళా సంఘాలు స్థిరమైన ఉపాధి ఆదాయాన్ని పొందుతాయి. లక్ష్యాలను త్వరగా చేరుకోవడానికి అర్హత కలిగిన సంఘాలు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

తారా ప్రభుత్వ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన -- మండల మహిళా సమాఖ్య సందర్శన





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19 (సింగిడి): తారా ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి)కు చెందిన వాణిజ్య శాస్త్ర విభాగం మరియు ఇంట్రెప్రెనేర్షిప్ డెవలప్మెంట్ సెల్ సంయుక్తంగా ఎం కాం , బి.కాం విద్యార్థుల కోసం మండల మహిళా సమాఖ్యకు క్షేత్ర పర్యటనను నిర్వహించాయి. ఈ క్షేత్ర పర్యటనలో సుమారు 30 మంది బి.కాం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు విద్యార్థులకు బ్యాంకు లింకేజీలు, మహిళా సంఘాలకు అందించే శిక్షణ కార్యక్రమాలు, జెండర్ రిసోర్స్ సెంటర్, డ్వాక్రా సంఘాల పనితీరు, స్త్రీ నిధి రుణాలు, మిల్లెట్ ఫుడ్ ఇండస్ట్రీ ద్వారా చేపడుతున్న స్టార్టప్‌లు, స్వయం ఉపాధి అవకాశాల గురించి వివరంగా తెలియజేశారు. అలాగే ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధిపై కలిగే ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనే మార్గాలు, వాటికి సంబంధించిన పరిష్కార చర్యలు, వడ్డీ లేని రుణాల ప్రాముఖ్యత, మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి 13 మంది మహిళా ప్రతినిధులు హాజరై తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. మహిళా సంఘాల ద్వారా సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, బ్యాంకుల ద్వారా పొందుతున్న ఆర్థిక సహకారం, చిన్న తరహా పరిశ్రమల స్థాపన, వ్యాపార నిర్వహణ వంటి అంశాలను తమ ప్రత్యక్ష అనుభవాల ఆధారంగా వివరించారు. వారి వాస్తవ జీవిత అనుభవాలు విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి ఆర్థిక కార్యకలాపాలు, మహిళా సాధికారత, గ్రామీణ అభివృద్ధి, వ్యాపార అవకాశాలపై ప్రాయోగిక అవగాహన కలిగింది. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి మాధవి, కోశాధికారి స్వాతి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమలత విద్యార్థులకు వివిధ అంశాలపై సమగ్ర సమాచారాన్ని అందించారు. విద్యార్థులు భవిష్యత్తులో స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో అవకాశాలను అన్వేషిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు సూచించారు. ఈ క్షేత్ర పర్యటనలో తారా ప్రభుత్వ కళాశాల తరఫున అధ్యాపకులు జ్యోతి, కరుణ, సంగీత, శ్యామ్ ప్రసాద్ విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు, మహిళా సంఘాల ఆర్థిక కార్యకలాపాలు, స్వయం సహాయక సంఘాల పాత్ర, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనను అర్థం చేసుకునేలా ఈ పర్యటన దోహదపడింది. ఈ క్షేత్ర పర్యటన విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, ఆర్థిక అవగాహన, మహిళా సాధికారత పట్ల గౌరవం, స్వయం ఉపాధి మరియు పారిశ్రామిక ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.కు చెందిన బి.కాం విద్యార్థులు మండల మహిళా సమాఖ్యను సందర్శించి, మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ మోర్చాల నూతన అధ్యక్షులకు ఘన సన్మానం



కీసర, నవంబర్ 19 (సింగిడి): ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ భారతీయ జనతా పార్టీకి చెందిన వివిధ మోర్చాల అధ్యక్షులుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులకు నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రబాబు రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన జూపల్లి నరేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన ఎర్ర వామన్, బీజేవైఎం అధ్యక్షుడిగా నియమితులైన మధు గౌడ్ ను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బీజ్జ శ్రీనుగౌడ్, నక్క కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రాజు అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్చెరు, నవంబర్ 19(సింగిడి): బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు శంబిపూర్ రాజు గురువారం శంబిపూర్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

నేచురల్ బర్తింగ్‌పై ప్రజల్లో అవగాహనకు నవంబర్ 22న సంగారెడ్డిలో వాక్

సంగారెడ్డి బ్యూరో నవంబర్ 19(సింగిడి): సహజ ప్రసవం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 22వ తేదీన సంగారెడ్డిలో నేచురల్ బర్తింగ్ అవగాహన వాక్ నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విజయ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా ఆధ్వర్యంలో నవంబర్ 22న దేశవ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించనున్న నేచురల్ బర్తింగ్ అవగాహన వాక్‌లో భాగంగా సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వాక్ నవంబర్ 22న ఉదయం 6 గంటలకు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రారంభమై ఐబీ జంక్షన్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్‌వైవ్స్, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్య నిపుణులు పాల్గొననున్నారని తెలిపారు. సహజ ప్రసవం యొక్క ప్రాముఖ్యత, వైద్యపరంగా అవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియ

పాక్‌తో మ్యాచ్‌లపై గంభీర్ ఆగ్రహం..



టీఆర్పీ, డబ్బు కోసమేనా అంటూ వైరల్ పోస్ట్!



భారత్–పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పేరుతో సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. పహల్‌గామ్ ఉగ్రదాడిలో 26 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో.. పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరం ఏముందని గంభీర్ ప్రశ్నించినట్లు ఆ పోస్టులో పేర్కొన్నారు. కేవలం టీఆర్పీ, ప్రకటనల ఆదాయం, డబ్బు కోసమే ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారంటూ బీసీసీఐ, ఐసీసీపై ఆయన విమర్శలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

షేక్ హ్యాండ్ అంశంపైనా వ్యాఖ్యలు?

పాకిస్తాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయకూడదన్న బీసీసీఐ ఆదేశాలను గంభీర్ సమర్థించినట్లు కూడా ఆ పోస్టులో ఉంది. ఈ నిబంధన కొనసాగాలని ఆయన కోరినట్లు పేర్కొన్నారు. దేశ భద్రత, సైనికుల త్యాగాల కంటే క్రికెట్ మ్యాచ్‌లు ముఖ్యమైనవి కావని వ్యాఖ్యానించినట్లు ప్రచారం సాగుతోంది. 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్–పాక్ మధ్య పలు మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉందని కూడా ఆ పోస్టులో ప్రస్తావించారు.



బాటిల్ మూతలతో బాల్ టాంపరింగ్ చేశాం..

మాజీ పేసర్ షోయబ్ అక్తర్

శాండ్‌పేపర్ వివాదంపై పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. తాము ఇంగ్లండ్ పర్యటనలో శాండ్‌పేపర్‌కు బదులుగా బాటిల్ మూతలతో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించే వాళ్లమని వెల్లడించాడు. బాల్ టాంపరింగ్ వ్యవహారం జట్టులో అందరికీ తెలిసే జరిగి ఉంటుందని అభిప్రా యపడ్డాడు. ఖవాజా ఈ విషయాన్ని బయటపెట్టిన సమయం సరైంది కాదని వ్యాఖ్యానించాడు.

Singidi Sports
స్పోర్ట్స్ సింగిడి

చెస్ ప్రపంచంలో

కొత్త వివాదం!

ప్రత్యర్థికి చెప్పకుండానే వెళ్లిపోయిన కార్ల్‌సన్..



చెస్ ప్రపంచంలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించే నార్వే గ్రాండ్‌మాస్టర్ మాగ్నస్ కార్ల్‌సన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నాడు. ఈసారి అతడి ఆటతీరు కంటే ప్రత్యర్థి పట్ల వ్యవహరించిన విధానం చర్చనీయాంశంగా మారింది. టోటల్ చెస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ టూర్ పైలట్ టోర్నీలో కజకిస్థాన్ క్రీడాకారిణి బిబిసారా అసౌబాయేవాతో పోటీ మధ్యలోనే కార్ల్‌సన్ వైదొలిగాడు. అయితే తాను టోర్నీ నుంచి వెళ్లిపోతున్నవిషయాన్ని ప్రత్యర్థికి నేరుగా చెప్పకపోవడం వివాదానికి కారణమైంది. ఆర్బిటర్‌కు సమాచారం ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయిన కార్ల్‌సన్.. బిబిసారాకు మాత్రం విషయం తెలియజేయలేదు. దీంతో ఆమె ప్రత్యర్థి కోసం కొంతసేపు వేచి చూడాల్సి వచ్చింది. ఈ వ్యవహారం చెస్ వర్గాల్లో చర్చకు దారితీసింది.

టోర్నీలోనూ నిరాశాజనక ప్రదర్శన

మరోవైపు ఈ టోర్నీలో కార్ల్‌సన్ ప్రదర్శన కూడా ఆశించిన స్థాయిలో లేదు. గ్రూప్ దశలో ఆడిన పది గేముల్లో ఒక్క విజయం కూడా నమోదు చేయలేకపోయాడు. తొమ్మిది గేమ్‌లు డ్రాగా ముగియగా.. మరో గేమ్‌లో ఓటమి చవిచూశాడు. దీంతో ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ ప్రదర్శన కారణంగా అతడి ఖాతాలోని 21.8 రేటింగ్ పాయింట్లు తగ్గాయి. దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న నంబర్‌వన్ ర్యాంక్‌కు ఎక్కడ ముప్పు వస్తుందోనని అభిమానులు ఆందోళన చెందారు.

ర్యాంకింగ్‌కు మాత్రం ఇబ్బంది లేదు

అయితే ఫిడే ఈ పైలట్ టోర్నీ ఫలితాలను అధికారిక రేటింగ్ లెక్కల్లో పరిగణనలోకి తీసుకోకపోవడంతో కార్ల్‌సన్ నంబర్‌వన్ ర్యాంక్‌కు ఎలాంటి ముప్పు ఏర్పడలేదు. దీంతో రేటింగ్ అంశం కంటే అతడి ప్రవర్తనే ఇప్పుడు ఎక్కువగా చర్చకు వస్తోంది. టోర్నీ నిర్వాహకులపైనా, కార్ల్‌సన్ వ్యవహారశైలిపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హుందాతనం ఎక్కడంటూ విమర్శలు

కార్ల్‌సన్ తీరుపై భారత ఒలింపియాడ్ చెస్ జట్టు కెప్టెన్ శ్రీనాథ్ నారాయణన్ కూడా స్పందించాడు. ఆటలో రేటింగ్ పాయింట్ల కంటే క్రీడాకారుల మధ్య ఉండాల్సిన హుందాతనం, మర్యాద ముఖ్యమని పరోక్షంగా విమర్శించాడు. ప్రత్యర్థికి కనీస సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోవడం క్రీడాస్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడి నుంచి ఇలాంటి ప్రవర్తన ఆశించలేదంటూ పలువురు చెస్ అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా

ఘనవిజయం..

9 వికెట్లతో సిరీస్‌లో ఆధిక్యం!



జొహన్నెస్‌బర్గ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1–0 ఆధిక్యంలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 400 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా 557 పరుగులతో భారీ ఆధిక్యం సాధించింది. మార్క్వెస్ అకెర్‌మాన్ (157), ర్యాన్ రికెల్టన్ (102) సెంచరీలతో రాణించగా.. కగిసో రబాడ 72 పరుగులు చేశాడు. దీంతో సఫారీలకు 157 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లు విజృంభించడంతో బంగ్లాదేశ్ 168 పరుగులకే కుప్పకూలింది. సైమన్ హార్మర్ ఆరు వికెట్లతో సత్తా చాటగా.. రబాడ మూడు వికెట్లు పడగొట్టాడు. దీంతో దక్షిణాఫ్రికా ముందు 12 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ప్రోటీస్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో తౌహిద్ హృదయ్ (137), లిటన్ దాస్ (120) సెంచరీలతో బంగ్లాదేశ్‌ను ఆదుకున్నారు.

Samantha

అదే అసలైన సవాలు



శ్రద్ధా కపూర్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఈత'. మరాఠీ దిగ్గజ కళాకారిణి విఠాబాయి నారాయణగావ్కర్ జీవిత కథ ఆధారంగా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్‌ను తెరకెక్కిస్తున్నారు. డిసెంబర్ 4న ఈ సినిమా విడుదల కాబోతుం డగా.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రద్ధా కపూర్ విఠాబాయి పాత్ర కోసం తాను పడిన కష్టాలతో పాటు.. పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాకు సంతకం చేసే సమయానికి తనకు లావణి డ్యాన్స్ గురించి ఏమీ తెలియదని శ్రద్ధా ఓపెన్‌గా చెప్పారు. దానికోసం ఎన్నో వర్క్‌షాప్స్‌లో పాల్గొని, శకుంతల జీ పంటి సీనియర్ కళాకారులను కలిసి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. కాలికి గజ్జెలు కట్టుకుని ప్రాక్టీస్ చేస్తే స్టెప్పులు ఎవరైనా వేయగలరని, కానీ తమాషా కళాకారుల జీవితాల్లోని కష్టాలను, బాధను, సంతోషాన్ని హావభావాల ద్వారా చూపించడమే అసలైన సవాలు అనిపించిందని శ్రద్ధా అన్నారు.

ఇక ఈ సినిమా షూటింగ్ సమయంలో తన కాలికి ఒక్కోవైపు నాలుగు కిలోల చొప్పున, మొత్తం ఎనిమిది కిలోల బరువైన గజ్జెలు కట్టుకుని డ్యాన్స్ చేశానని శ్రద్ధా వెల్లడించారు. ఓ పాట చేస్తున్న సమయంలో గాయపడి.. కొద్ది కాలం పాటు షూటింగ్‌కు గ్యాప్ ఇచ్చినట్లు తెలిపారు. అయితే దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ప్రతి పాటకు ముందు రెండు మూడు వారాల పాటు కఠినమైన రిహార్సల్స్ చేయించడం వల్లే తాను ఆ పాత్రకు న్యాయం చేయగలిగానని ఆమె చెప్పారు. ఇక సినిమాల ఎంపిక గురించి మాట్లాడుతూ..తనకు కథ మాత్రమే ముఖ్యమని శ్రద్ధా అన్నారు. తాను 80 లేదా 90 ఏళ్ల వయసుకు వచ్చాక, ఫలానా మంచి సినిమా చేయలేకపోయా ననే బాధ తనకు ఉండకూడదని, అందుకే 'ఈత' లాంటి గొప్ప కథల కోసమే ఎదురు చూస్తుంటానని తెలిపారు.

ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ... రష్మిక



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. ఈ సినిమాలో రష్మిక ఇంతకుముం దెన్నడూ కనిపించని పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించనుండగా.. ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయింది. రావీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఆమె గోండ్ తెగకు చెందిన యువతి పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ప్రయాణం గురించి రష్మిక ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మైసాగా మారే ప్రయాణం షూటింగ్ ప్రారంభానికి చాలా కాలం ముందే మొదలైంది. శిక్షణ, సన్నాహాలు, ప్రతిరోజూ ఎదురైన చిన్న చిన్న సవాళ్లు.. గతంలో ఎప్పుడూ చేయని పనులను చేసేందుకు నన్ను నేను ప్రోత్సహించుకోవడం.. ఇదొక ప్రత్యేకమైన అనుభవం" అంటూ తన అనుభవాలను పంచుకున్నారు. ప్రజెంట్ ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. ఈ సినిమా మీ కెరీర్‌లోనే బెస్ట్ హిట్ ఇస్తుంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు



సమంత రీఎంట్రీ!

సినిమా సింగిడి Cinema Singidi

తమిళంలో ఘన విజయం సాధించిన సైబర్ క్రైమ్ థ్రిల్లర్ 'ఇరుంబుతిరై' సినిమాకు సీక్వెల్‌గా 'ఇరుంబుతిరై 2' తెరకెక్కించేందుకు గత కొంత కాలంగా సన్నాహాలు జరగుతున్న విషయం తెలిసిందే. విశాల్ హీరోగా నటించిన మొదటి భాగం తెలుగులో 'అభిమన్యుడు' పేరుతో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. డిజిటల్ ప్రపంచంలో వ్యక్తిగత సమాచారం ఎలా దుర్వినియోగం అవుతోంది? సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాన్య ప్రజలను ఎలా మోసం చేస్తున్నారు? అనే అంశాలను ఉత్కంఠభరితంగా చూపించిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన AI టెక్నాలజీని కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎలా ఉపయోగించుకుంటున్నారు? దాని వల్ల ఎలాంటి ప్రమాదాలు ఎదురవుతున్నాయి? అనే అంశాలను థ్రిల్లింగ్‌గా చూపించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 'ఎనిమీ' సినిమా తర్వాత ఆర్య ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. సమంత కూడా సినిమారంగంలోకి తిరిగి వచ్చిన తర్వాత ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం. ఈ తాజా సమాచారంతో సినిమాపై హైప్ పెరిగింది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737